దెయ్యం పిలుస్తోంది!

సుంకరి రాంప్రసాద్

అరకు రైల్వేస్టేషన్‌కు రెండు కిలోమీటర్ల దూరంలో ఉంది ఆ జలపాతం.

నీలి కొండలమీద పచ్చగా పరచుకుని వున్న దట్టమయిన అడవి కనుల విందు చేస్తూంది.

వనకన్య ధరించిన తెల్లని పయ్యెద పిల్లగాలికి అల్లల్లన ఎగురుతూందా అన్నట్లుగా వుంది పర్వత శిఖరం నుండి జాలువారుతున్న ఆ జలపాతం. చెవులు గింగురుమనేలా వినిపిస్తున్న ఆ జలపాతపు హోరుతో ఆ లోయంతా ప్రతిధ్వనిస్తూంది.

ఆ మనోజ్ఞ దృశ్యం చూస్తూ పరవశంతో ఒళ్ళు మరిచిపోతూంది సునంద.

అంత ఆనందంలోనూ ఆ ఉధృత జలపాతాన్ని చూస్తుంటే ఆమె గుండెల్లో యేదో తెలియని తీయని భయం. ఒక ప్రక్క ఆ హోరును, ఆ జలపాతపు జోరును చూద్దామని కొండంత ఆశ, ఆరాటం. కనులువిప్పి చూస్తే

యేదో భయం, బెరుకు. దీనినే తీయని భయం అంటా రేమో!

తన భర్త విజయ్ చేతిని గట్టిగా పట్టుకుని చూడ సాగింది ఆమె. ఈ మధ్యనే పెళ్ళయిన క్రొత్త దంపతులు వారు. ఒకవిధంగా వారి కిది హానీమూన్ ట్రిప్.

మనసుకు మత్తెక్కిస్తున్న ఆ ప్రకృతి అందాల మధ్య ఒకరికోసం ఒకరులా తామిద్దరమే ఉన్నామన్న భావన వారిలో ఏదో తెలియని పరవశత్వాన్ని కల్గించసాగింది. ప్రేమగా సునందను దగ్గరకు తీసుకున్నాడు విజయ్. గువ్వలా అతడి కౌగిలిలో ఒదిగిపోయిందామె.

కళ్ళల్లో ఆరాధన ఉట్టిపడుతుంటే ఆమె రెండు చెక్కిళ్ళనూ దోసిలిలోనికి తీసుకున్నాడతడు. పరవశత్వంతో అరమోడ్చిన ఆమె సోగ కన్నులలోని ఆహ్వానం, ఎఱ్ఱని పెదవులమీద సన్నగా మెరిసిన దరహాసం అతడిని వివశుడ్ని చేసాయి. పట్టలేని తమకంతో ఆమె పెదవులను గాఢంగా చుంబించాడతడు.

యుగాలు క్షణాలుగా కాలం తీయగా కరిగే వేళ, వారి ఆనందానికి రసభంగం కల్గిస్తూ వారి చెవులకు సోకింది ఒక స్త్రీ ఆర్తనాదం.

భరించలేని బాధతో అరచినట్లున్న ఆ ఆక్రందనతో ఆ లోయంతా మారుమ్రోగింది. ఆర్తితో గుండెలు పిండేసేలా ఉంది ఆ గొంతు.

మరుక్షణం వారు ఆ ఆర్తనాదం వినవచ్చిన దిక్కుకు పరుగెత్తారు. ఎంతోదూరం పరుగెత్తవలసిన పనే లేకపోయింది వారికి. సుమారు వెయ్యిగజాల దూరంలో ఏపుగా పెరిగిన పొదలమాటున కనిపించింది వారికి అత్యంత బీభత్సమైన దృశ్యం.

ఆ దృశ్యాన్ని చూసిన మరుక్షణం 'కెవ్వు'మని కేక పెట్టింది సునంద. ఆ ఆర్తనాదం యెలా వినవచ్చిందో వారికి ఆ క్షణంలోనే అర్థమయిపోయింది.

అక్కడున్న కొండరాళ్ళ మధ్య పడివుంది ఒక అందమయిన యువతి శవం. సుమారు పాతికేళ్ళ లోపే వయసుంటుంది. చక్కగా తీర్చిదిద్దినట్లున్నాయి పొంకమైన ఆమె అవయవాలు.

ఆమె తల రక్తసిక్తమయి వుంది. ఆమె పడివున్న బండరాయిమీద, ఆమె తల వున్న భాగంలో రక్తం మడుగు కట్టివుంది. ఆమె వంటిమీదున్న తెల్లని చీరమీద చిందిన ఎర్రని రక్తపుమరకలు మరింత బీభత్సంగా కనిపిస్తున్నాయి.

పదిగజాల దూరంలో నుండి చూస్తున్నా వారు ఆ శవాన్ని గుర్తుపట్టగలిగారు. ఆమె నాగమణి.

అరుకులో వారుంటున్న ట్రావెలర్స్ బంగళాలో వారి ప్రక్కగదిలోనే నాగమణి కూడా వుంటూంది. తాను పాడేరులోని ఎలిమెంటరీస్కూల్లో టీచర్ గా పని చేస్తున్నానని, వారిలాగే తాను కూడా అరకులోయలు చూడటానికి వచ్చానని, ఏదో మాటల సందర్భంలో సునందతో చెప్పింది నాగమణి.

వారు ఒకరి నొకరు కలుసుకున్నది కేవలం రెండు రోజుల క్రితమే అయినా, యెప్పుడూ గల, గల నవ్వుతూ యెంతో కలుపుగోలుగా కబుర్లు చెప్పే నాగమణి పట్ల సునందకు ఒకరకమైన యిష్టం యేర్పడింది.

అలాంటి నాగమణిని యిలా ఆకస్మాత్తుగా శవంగా చూసేసరికి, సునంద ఆ షాక్ ను తట్టుకోలేకపోయింది.

భయంతో, పాలిపోయిన ముఖంతో తోటకూర కాడలా వడలిపోతున్న సునంద భుజాలు పట్టుకుని మెల్లగా నడిపించుకుంటూ ఆ ప్రదేశం నుండి దూరంగా తీసుకుపోయాడు విజయ్.

మళ్ళీ వారు కనీసం వెనుతిరిగి కూడా చూడలేదు. ఒకవేళ చూసే ఉండినట్లయితే....?

ముందు ముందు ప్రారంభం కానున్న మారణహోమానికి నాందిగా. సన్నగా అస్పష్టంగా, వికృతంగా నవ్వుతున్న నాగమణి శవాన్ని వారు గమనించేవారేమో!

2

“సునందా! ఫర్ గాడ్ సేక్ మనం ఆ విషయాన్ని పూర్తిగా మరచిపోవడం మంచిది” అన్నాడు విజయ్.

“కానీ....దిక్కులేని ఆ శవం ...”

“సునందా” అంటూ భార్య మాటలను మధ్యలోనే కట్ చేసాడతను.

“నేనెందుకు చెబుతున్నానో కాస్త అర్థం చేసుకో డార్లింగ్. ఇప్పుడు మనం ఆ శవాన్ని చూసినట్లు నిజమే చెప్పామనుకో. ఏముంటుంది....పోలీస్ కేస్ ప్రారంభమవుతుంది. అది హత్యా? ఆత్మహత్యా? అని దానిపై ఎంక్వయిరీ. ఆమెకూ మనకూ యేమిటి సంబంధమని లక్ష యక్ష ప్రశ్నలు. ఓహ్! మనకెందుకా లేనిపోని తద్దినం?

“కనీసం ఆ నాగమణి యెవరో కూడా, యిక్కడకు వచ్చేవరకూ మనకు తెలియదు. ఏదో వాళ్లో అంటే వాళ్లో అనుకున్నాం. దట్సాల్. యిప్పుడు కోరి ఆమె చావును మన పీకలమీదకు తెచ్చుకోవడం ఎందుకు?”

ట్రావెలర్స్ బంగళాలోని తమ గదిలో కూర్చుని భార్యకు నచ్చచెప్పసాగాడు విజయ్.

"అంటే మీర నేది నాగమణి చనిపోయిన విషయం" అంటూ భర్తవైపు సందిగ్ధంగా చూసింది సునంద.

"అసలు నాగమణి ఎవరోకూడా మనకు తెలియదు డార్లింగ్. మనం అక్కడేమీ చూడలేదు. అంతే! ఆ విషయం నీ దక్కడా నోరు జారనని నాకు ప్రామిస్ చేయాలి...." అంటూ ఆమె కుడిచేతిని తన తలపై వేసుకున్నాడు విజయ్.

ఒట్టుపట్ల హిందూ స్త్రీలకుండే నమ్మకం, గౌరవం విజయ్‌కు తెలుసు. అందుకే భార్యతో ఆ వాగ్దానం తీసుకున్నాడతడు. ఎంతో ఆనందంగా గడవాల్సిన తమ వివాహపు తొలి దినాలను ఈ వ్యవహారంలో తలదూర్చి పాడు చేసుకోవడం మనసులో యే మూలో ఆమెకుకూడా ఇష్టంలేదు. అందుకే తన భర్తకు ప్రామిస్ చేసిందామె.

ఆ రోజు మధ్యాహ్నమే వారు తమ గదిని ఖాళీ చేసేశారు. సాయంత్రం నాలుగు గంటల ప్రాంతంలో వైజాగ్ నుండి కిరండోల్‌కు వెళ్ళే ప్యాసెంజరు రైలు వుంది. అందులో జయపూర్‌కు ప్రయాణమయ్యారు వారు.

జయపూర్‌లో వారికి పెద్ద ఎస్టేట్ వుంది. కొన్ని వందల ఎకరాలుండే కాఫీ, మల్బరీ తోటలకు యేకైక వారసురాలు సునంద. తల్లీ, తండ్రీ చిన్నతనంలోనే చనిపోవడంతో జయపూర్‌లోని తాతగారి దగ్గరే పెరిగి పెద్దయిందామె. తన తాతగారి దగ్గర మేనేజర్‌గా చేరిన విజయ్‌ను ప్రేమించి, పెళ్ళిచేసుకుంది సునంద.

వారి పెళ్ళికి నెలరోజులముందే గుండె జబ్బుతో మరణించాడు ఆమె తాతగారు. తాతయ్య మరణానంతరం అతని యావదాస్తీ ఆమెకే సంక్రమించింది.

ఎస్టేట్‌నూ, తననూ కంటికి రెప్పలా చూసుకొనే

విజయ్ భర్తగా లభించడం తన అదృష్టమనుకుంది ఆమె.

కిటికీ ప్రక్క సీటులో కూర్చుని చివరిసారిగా అరకు అందాలను చూస్తూంది సునంద. రైలు నెమ్మదిగా వేగం పుంజుకోసాగింది. అరకు స్టేషన్ క్రమ, క్రమంగా కను మరుగవసాగింది.

3

కోరాపుట్ జిల్లాలోని మారు మూల గ్రామమది. నాగరిక ప్రపంచానికి దూరంగా అడవి అంచున విసిరేసి నట్లుంది ఆ ఊరు. ఆ ఊరి చివరున్న ఒక రెల్లు గుడిసెలో ఇద్దరు వ్యక్తులు కూర్చుని వున్నారు.

మట్టి నేల చక్కగా పేడతో అలకబడి వుంది ఆ గుడిసె లోపలిభాగం. దక్షిణ దిక్కుగా నక్షత్రాకారంలో వేయబడిన ముగ్గు మధ్య కూర్చుని ఉన్నాడు ఒక మధ్య వయస్కుడు. అతనికి కొద్ది దూరంలో ఆ గదిలోని ఒక మూల కూర్చుని అతడు చేస్తున్న పూజా కార్యక్రమాన్ని ఆసక్తితో గమనిస్తున్నాడు ఒక వ్యక్తి.

ఆ ముగ్గు చుట్టూ యేవో విచిత్రాక్షరాలు రక్తంతో వ్రాయబడి వున్నాయి. తల కోయబడ్డ నల్లకోడి పెట్టా, చెక్కలుగా కోయబడ్డ నిమ్మకాయలు. ఆ గదినంతా కప్పేస్తున్న గుగ్గిలపు ధూపం....ఆ గదిలో ఒక విచిత్ర మయిన వాతావరణాన్ని సృష్టిస్తున్నాయి.

ముగ్గు మధ్య కూర్చున్న వ్యక్తి చిన్న గోచీ మాత్రం ధరించాడు. అప్పుడే తలారా స్నానం చేసినట్లు విరబోసు కుని వున్న అతని తల నుండి బొట్లు, బొట్లుగా నీరు కారు తోంది. ఎర్రని కుంకుమబొట్టు అతని నుదురులో సగ భాగాన్ని కప్పేసింది. అతని పెదవులు మెల్లగా యేవో మంత్రాలను ఉచ్చరిస్తున్నాయి.

కొద్ది నిముషాల తరువాత అతడు మెల్లగా కళ్ళు తెరిచాడు. గది మూలను కూర్చున్న యువకుని దగ్గరకు రమ్మని పిలిచాడు.

"ఆ యమ్మ కాలిగోరు, తలవెంట్రుక తెస్తివా బాబూ?" అన్నాడతడు మెల్లగా.

ఆ యువకుడు తెచ్చానన్నట్లు తలూపాడు. తన చొక్కా జేబులోని ఓ కాగితపు పొట్లాన్ని అతడికిచ్చాడు ఆ యువకుడు. ఆ కాగితపు పొట్లంలోని తల వెంట్రుకను, కాలిగోరును చూసి సంతృప్తిగా తలాడించాడతడు.

తన ముందు మానవ ఆకారంలో చేయబడ్డ పిండి బొమ్మ మీద, ఆ గోరును, తల వెంట్రుకను ఉంచాడతడు.

"ఆ యమ్మ పేరేమిటన్నావు బాబూ?"

'సు....న....ంద" ఒక్కొక్క అక్షరమే వత్తి పలుకుతూ మెల్లగా అన్నాడా యువకుడు.

కొద్ది నిముషాల సేపు మంత్రోచ్ఛాటనలో మునిగిపోయాడతడు. మెల్లగా కళ్ళు తెరిచి రెండు నిమ్మకాయలను చేతిలోనికి తీసుకున్నాడు. వాటిని ముక్కలుగా చేసి ఆ పిండి బొమ్మకు అటూ, ఇటూ పడేశాడు. ఆ నిమ్మచెక్కలను చూసిన యువకుడు ఆశ్చర్యంతో నోరు వెళ్ళబెట్టాడు.

అవి ఎర్రని రక్తపు ముద్దలులా ఉన్నాయి.

అరచేతిలో కర్పూరాన్ని వెలిగించాడతడు, గాలిలో దేనినో ఆహ్వానిస్తున్నట్లు చేతిని చాచి వెలుగుతున్న ఆ కర్పూరాన్ని ఆ పిండిబొమ్మపై వేశాడు.

అంతే! కన్నులు మిరుమిట్లు గొలిపే కాంతితో ఆ బొమ్మ దగ్ధమై పోయింది. ఆ తంతు నంతా విస్మయంగా చూస్తున్నాడా యువకుడు. ఇక పూజ పూర్తయిందన్నట్లు

లేచాడతడు.

జేబులో నుండి పది వందరూపాయల నోట్లను లెక్క పెట్టి అతని చేతిలో పెట్టాడా యువకుడు. వాటిని అందుకొని గొంతులో దోపుకున్నాడతడు.

“ఆ యమ్మకు ఎరిగున్న జీవుడే దయ్యమై వస్తది. నీ కోర్క్యా పండవుతదిలే. ఎల్లిరా” అన్నాడతడు.

అతడి దగ్గర శలవు తీసుకొని ఆ గది బయటకు నడిచాడు ఆ యువకుడు. ఇప్పుడు అతని మనసు ఎంతో తేలికగా వుంది.

ఆ యువకుని పేరు దివాకర్. సునందకు వరుసకు బావ అవుతాడు. సునంద తనను పెళ్ళాడుతుందని గంపెడు ఆశలు పెట్టుకున్నాడతడు. కాని సునంద విజయ్‌ను పెళ్ళాడటంతో అతని ఆశలన్నీ వమ్మయినాయి.

కోట్ల విలువచేసే ఆస్తి, కోరుకున్న వరసైన మరదలు ఎవరో అనామకుడిపాలై పోతుంటే చూస్తూ సహించలేకపోయాడు. అసలు సునందే లేకుంటే సునంద తాతగారికి దాయాదులైన దివాకర్ కుటుంబానికే ఆ ఆస్తంతా సంక్రమించి వుండేది.

ఇప్పుడు సునందకు పెళ్ళి కావడంతో అతనికి ఇద్దరు అడ్డు తగలయ్యారు. ఒకరు సునంద, రెండవవాడు విజయ్. ఆస్తికోసం వారిని తన దారిలో నుండి తప్పించడం పెద్ద సమస్య కాదు అతనికి. కాని వారు మరణించిన మరుక్షణం ఆ నేరం ఆ ఆస్తికి తదుపరి వారసుడైన అతడిమీదకే వస్తుంది.

కాని, చూస్తూ, చూస్తూ అంత ఆస్తిని ఎలా వదులుకోగలడు? అందుకే యెవరికీ అనుమానం రాని ఈ మార్గాన్ని ఎన్నుకున్నాడతడు.

ఒరిస్సాలోని కొండవారు, సవరలు, మంత్రాలలో ప్రసిద్ధులని వినికిడి. అందుకే తన కార్యం కోసం అతడో కోయదొరగా పట్టుకున్నాడు.

'చిల్లంగో... చేతబడో... ఆ కోయదొర యేం చేస్తే తన కెందుకు? తనకు కావలసింది సునంద, విజయ్‌ల చావు.

కోయదొర చెప్పిన ఆ దెయ్యాన్ని సునందకు ఆవహింపజేస్తే ...ఆమెతోనే విజయ్‌ను హత్య చేయించాలి. హత్యకు ఆమెకు శిక్షయినా పడుతుంది. లేకున్నా పర్వాలేదు. తన భర్తను తానే చేజేతులారా చంపుకున్నానన్న నిజాన్ని జీర్ణించుకోలేక సునందే మరణిస్తుంది. ఇంకా కావాలనుకుంటే సునందకు జీవితంపట్ల విరక్తిని పుట్టించి ఆత్మహత్యకు తానే ప్రోత్సహిస్తాడు'

ఆలోచనలలో తేలిపోతూ మెల్లగా నడుస్తున్నాడు దివాకర్. అతడు కనుమరుగయ్యేదాకా చూసి తనువాత గుడిసెలోకి నడిచాడు కోయదొర.

అయితే ఆ గుడిసెలో జరిగిన తంతునంతా ఒక జత కళ్ళు గమనిస్తున్నాయని వారిద్దరకూ తెలియదు.

4

“దివాకర్ యేదో ప్రక్కదారి పడుతున్నట్టుంది సునందా!” అన్నాడు లాయర్ రఘు.

ప్రశ్నార్థకంగా అతడివైపు చూశారు విజయ్, సునందలు.

జయపూర్ సిటీకి దూరంగా, కోరాపుట్ కు వెళ్ళే మార్గంలో వుంది ఆ అధునాతన భవంతి. అది సునంద తాతగారి బంగళా. అందులోని డ్రాయింగ్ రూమ్‌లో

కూర్చుని మాట్లాడుకుంటున్నారు వారు.

సునంద తాతగారి స్నేహితులైన లాయర్ విశ్వనాథం గారి అబ్బాయి రఘు. తండ్రి తరువాత అతడే వారి ఎస్టేట్ యొక్క లీగల్ వ్యవహారాలన్నీ చూస్తూంటాడు.

నిజానికి సునంద తాతగారికి సునందను రఘు కిచ్చి పెళ్ళి చేద్దామని ఉండేది. కాని తన మనసులోని కోరిక కన్నా, కలసి కాపురం చేయాల్సిన సునంద అభిప్రాయానికే విలువనిచ్చాడతడు.

చిన్నతనం నుండీ పరిచయం ఉండటంచేత వారిద్దరి మధ్యా పేర్లతో పిలుచుకునేపాటి చనువుంది. లాయర్ రఘు యువకుడు, చురుకైనవాడు. సునంద తనను కాదని విజయ్‌ను పెళ్ళి చేసుకుందని అతనికి తెలుసు. కాని ఆ కారణంచేత వారితో తనకున్న మైత్రి సంబంధాలను తెంచుకోలేదు అతడు.

ఒక్కసారి వారిద్దరివైపు చూసి లోగొంతుతో చెప్పడం ప్రారంభించాడతడు.

"నిన్న సాయంత్రం కోరాపుట్ నుండి కొట్టుక వెళ్ళి వస్తున్న నాకు ఫారెస్టులో నుండి వెళ్తున్న దివాకర్ కనిపించాడు. చీకటిపడే వేళ అడవిలో నడుచుకుంటూ వెళ్ళాల్సిన పని అతనికేముందనిపించింది నాకు. అనుమానంతో అతడిని అనుసరించాను" అంటూ రాత్రి ఆ గుడిసెలో వారు నిర్వహించిన తాంత్రిక పూజ గురించి చెప్పాడు రఘు

"చాటు నుండి చూస్తున్న నన్ను బహుశా వారు గమనించలేదనుకుంటాను."

అతను చెబుతున్న మాటలను నిశ్చేష్టురాలై వింటోంది సునంద.

"ఆ.. యింకా ఈ దెయ్యాలూ, చేతబడులూ యేమిటండీ రబ్బిష్. ఐ కాంట్ బిలీవ్ ఆల్ దీజ్ థింగ్స్" అతని మాటలను తేలిగ్గా కొట్టిపారేశాడు విజయ్.

"ఏనీ హౌ మీరు కాస్త జాగ్రత్తలో ఉండటం మంచిది" అంటూ లేచాడు.

అతడిని గేటువరకూ సాగనంపాడు విజయ్.

5

రాత్రి తొమ్మిది గంటల సమయం.

డైనింగ్ హాల్లో కూర్చుని సప్పర్ తీసుకుంటున్నారు విజయ్, సునందలు. వారిని డిస్టర్బ్ చేస్తూ కాలింగ్ బెల్ మ్రోగింది. విసుగ్గా చూసింది సునంద.

రాత్రి ఏడుగంటలకే పనివారిద్దరూ పని పూర్తిచేసుకొని వెళ్ళిపోయారు. పుట్టింటికి వెళ్ళిన వాడి భార్యకు ఆరోగ్యం బాగులేదని ఉత్తరం రావడంతో వాచ్ మేన్ వారం రోజులు శలవు తీసుకొని ఊరికి వెళ్ళాడు. అంత పెద్ద బంగళాలో ఉండేది తామిద్దరమేనన్న భావన ఒకప్పుడయితే ఆమెకు యెంతో ఆనందాన్నిచ్చేది. కాని యిప్పుడెందుకో ఆమెకు అసహనంగా వుంది.

విసుక్కుంటూ లేచి సింక్ లో చేయి కడుక్కుని తలుపువైపు నడిచింది ఆమె. తలుపు తెరిచిన ఆమెకు యెదురుగా ఉన్న ఆకారాన్ని చూసేసరికి భయంతో ముచ్చెమటలు పట్టాయి.

ఎదురుగా నవ్వుతూ నిలుచుని వుంది నాగమణి.

భయంతో మాట పెగలక అలానే వుండిపోయింది సునంద.

సునంద కళ్ళలోకే చూస్తూ మెల్లగా గొంతు విప్పింది నాగమణి. నూతిలో నుంచి మాట్లాడుతూన్నట్లుంది ఆ

గొంతు. రహస్యం చెబుతున్నట్లు వినీ వినబడనట్లున్నాయి ఆమె మాటలు.

"రా....రా....సునందా! నాతో వచ్చేయ్!"

"రా....సునందా!....రా....!"

సునందవైపు ఆహ్వానిస్తున్నట్లు చేతులు చాచింది నాగమణి. చల్లగా వీస్తున్న గాలికి ఆమె కట్టుకొన్న చీర, విరబోసుకున్న నల్లని కురులూ ఎగురుతున్నాయి.

భయంతో నిలువెల్లా వణికిపోయింది సునంద.

తలుపు తీయడానికి వెళ్ళిన భార్య బొమ్మలా అక్కడే నిలుచుండిపోవడం చూసిన విజయ్ తను కూడా చేయి కడుక్కొని సునంద దగ్గరకు వచ్చాడు. మాటా, మంతీ లేకుండా నిలువుగ్రుడ్లు వేసుకొని చూస్తున్న భార్యను చూశాడతడు. ఆమె రెండు భుజాలనూ పట్టుకుని కుదిపాడు.

"సునందా .... సునందా! వాట్ హేపెండ్ డార్లింగ్ ...."

అనునయంగా అడుగుతున్న భర్త వంక చూస్తూ బావురుమంది సునంద. కొండంత ఆసరా దొరికినట్లు అతని గుండెల్లో ముఖం దాచుకుంది ఆమె. తల తిప్పకుండానే వాకిలివైపు చేతిని చూపిస్తూ వణుకుతున్న గొంతుతో అందామె,

"అక్కడ....అక్కడ....నాగమణి....ఉందండి"

భార్య మాటలకు చటుక్కున తలెత్తి చూశాడతడు.

"ఛ....ఛ....యిక్కడెవరూ లేరోయ్. కావాలంటే చూడు" మెల్లగా భార్య చుబుకాన్నెత్తాడతడు.

భర్త మాటలకు మెల్లగా కళ్ళెత్తి చూసిందామె,

సన్నగా నవ్వుతూ—అక్కడే నిలబడి ఉంది నాగమణి.

"రా....వచ్చేయ్ సునందా!"....అదే గొంతు, అదే రూపం.

"అదిగోండి....నాగమణి అక్కడే నిలబడి వుంది. నన్ను రమ్మంటోంది" గుండెల్లో నుండి దుఃఖం పొంగుకొస్తూ చే కన్నీళ్ళతో బేలగా భర్త వంక మాస్తూ అంది సునంద.

మరోసారి సునంద చూపిస్తున్న దిక్కువంక చూశాడతడు. భార్యను బుజ్జగిస్తున్నట్లు దగ్గరకు తీసుకున్నాడు.

"ఎవరూ లేరోయ్ అదంతా నీ భ్రమ. అక్కడ నాగమణి శవాన్ని చూశావు. ఇంతకు క్రితం రఘు అన్న మాటలు తలచుకుని వుంటావు. నాగమణీ లేదూ దెయ్యమూ లేదు. కమాన్, రిలాక్స్!"

అనునయంగా ఆమె చెక్కిళ్ళు నిమురుతూ ఆమెను మెల్లగా లోపలకు నడిపించుకు వెళ్ళాడు విజయ్.

భర్త తలుపు క్లోజ్ చేస్తూండగా చివరిసారిగా వాకిలిలోకి చూసిందామె. నాగమణి అదే భంగిమలో అక్కడే నిలబడి వుంది.

'తనకు పిచ్చిగాని పట్టలేదు కదా' అనుకుంది ఆమె. 'తనకు అంత స్పష్టంగా నాగమణి కన్పిస్తూంది, ఆమె గొంతు విన్పిస్తూంది, కాని తనభర్తకు ఎవరూ కనిపించటం లేదంటే విచిత్రంగా వుంది.'

కోయదొర దివాకర్‌తో చెబుతూండగా తాను విన్నానని రఘు చెప్పిన మాటలు హఠాత్తుగా గుర్తుకు వచ్చాయి ఆమెకు.

'ఆ యమ్మకు ఎరికున్న జీవుడే దెయ్యమై వస్తది.'

'అంటే తనకు తెలిసిన నాగమణే దెయ్యమై వచ్చిందా?' ఆ ఊహకే భయంతో మరోమారు కంపించి పోయింది ఆమె.

ఆ రాత్రి బాగా పొద్దుపోయే వరకూ నిద్ర పట్టలేదు ఆమెకు.

6

మరునాడు ఉదయం ఎస్టేట్ కు బయలుదేరుతున్న భర్తతో, ఒంటరిగా ఉండలేక తను కూడా బయలు దేరింది సునంద.

వీపులపై చిన్న చిన్న వెదురుబుట్టలను ధరించి కాఫీ గింజలను యేరుతున్న కూలీలను చూస్తూ ...ఆ కాఫీతోట లోనే కాంప్ ఫైర్ వేసుకుని మధ్యాహ్నం వరకూ కూర్చుందామె. ఆ అందమైన ప్రకృతి మధ్య ఆ అమా యక జీవులను చూస్తూ తన మనసులోని క్లేశాన్ని మరచి పోయిందామె.

మధ్యాహ్నం ఒంటిగంట సమయంలో ఎస్టేట్ వ్యవ హారాలు పూర్తిచేసుకొని ఆమె దగ్గరకు వచ్చాడు విజయ్. ఆసరికి యింటిదగ్గర నుండి భోజనం కారేజ్ లో తెచ్చి యెస్టేట్ లోని గెస్టు హౌస్ లో ఉంచాడు డ్రైవర్.

డ్రైవర్ ను అక్కడే వదిలేసి భార్యతో సహా గెస్టు హౌస్ కు కారులో బయలుదేరాడు విజయ్. గెస్టుహౌస్ ఆవరణలో భార్యను దింపాడతడు.

"నేను కారును చెట్టునీడలో పార్క్ చేసి వస్తాను. నీవు పద డార్లింగ్!" అన్నాడతడు.

భర్త వచ్చేసరికి అన్నీ సర్దించి సిద్ధంగా ఉంచుదా మని గెస్టుహౌస్ లోకి నడిచింది ఆమె. డైనింగ్ హాలు

తలుపును తోసింది. కిర్రుమని శబ్దం చేస్తూ మెల్లగా తెరుచుకుంది.

ఆమె వడ్డించనవసరం లేకుండానే ఆ డైనింగ్ టేబిల్ మీద నున్న డిషెస్‌లో పదార్థాలన్నీ వడ్డించి వున్నాయి. ఎదురుగా నున్న కుర్చీలో ఆమెకోసమే ఎదురుచూస్తున్నట్లు నాగమణి కూర్చుని వుంది.

"రా....సువందా....! నీ కోసమే కాచుకుని వున్నాను." నవ్వుతూ అందామె.

అంతే! కెవ్వుమని కేకవేస్తూ గిరుక్కున వెనుతిరిగి బయటకు పరుగెత్తిందామె. అప్పుడే లోపలికి అడుగు పెడుతున్న విజయ్ భార్యవంక ఆశ్చర్యంగా చూశాడు.

'డైనింగ్ హాల్లో నాగమణి కూర్చుని వుందన్న భార్య మాటలకు ఫక్కుమని నవ్వాడతడు. భార్యను బుజ్జగించి మళ్ళీ మామూలు మనిషిని చేసేసరికి అతనికి పావుగంట పైనే పట్టింది.

భర్త చేయిని గట్టిగా పట్టుకొని బెరుకు, బెరుకుగానే మళ్ళీ డైనింగ్ హాలులోకి అడుగుపెట్టిందామె. ఈ సారి కనిపించిన దృశ్యంతో ఆమెకు తల తిరిగిపోయింది.

అక్కడ....ఆ కుర్చీలో నాగమణి లేదు. అయితే అది కాదు ఆమెను ఆశ్చర్యంలో ముంచెత్తుతున్నది. డైనింగ్ టేబిల్ మీద నున్న డిషెస్ అన్నీ ఖాళీగా వున్నాయి. తను కొన్ని నిముషాల ముందు ఆ డిషెస్‌లో పదార్థాలు వడ్డింపబడి వుండటం తన రెండు కళ్ళతో చూసింది.

కానీ ఇప్పుడవి ఖాళీగా తనను వెక్కిరిస్తున్నట్లున్నాయి. గబగబా వెళ్ళి వాటిని పట్టుకొని చూసిందామె. నీట్‌గా శుభ్రంగా గుడ్డతో తుడిచినట్లున్నాయి ఆ పింగాణీ పాత్రలు. తన అనుమానం తీరక కారేజ్‌ను

విప్పి చూసిందామె. నిండుగా పదార్థాలతో వున్న కప్పులను చూసేసరికి ఆమె తల తిరిగిపోయింది.

తను చూసింది భ్రాంతో.... నిజమో తెలియక తల పగిలిపోసాగింది ఆమెకు. అన్యమనస్కంగానే భోజనం ముగించిందామె. అప్పటికే భోజనం పూర్తిచేసి, నేప్‌కిన్ తో చేయి తుడుచుకుంటూ ఆ గది బయటకు నడిచాడు విజయ్.

సింక్ లో చేయికడుగుకుని నేప్ కిన్ కోసం హాంగర్ పై చూసింది. ఖాళీగా వున్న హాంగర్ వంక విసుగ్గా చూసిందామె.

“నేప్ కిన్ కావాలా సునందా! ఇదిగో తీసుకో.”

తన వెనుక అకస్మాత్తుగా వినిపించిన మాటలకు గిరుక్కున వెనుతిరిగి చూసిందామె.

నేప్ కిన్ ను అందిస్తూ నిలుచున్న నాగమణిని చూసేసరికి ఆమె పై ప్రాణాలు పైనే పోయాయి.

“ఏమండీ!” భయంతో అరుస్తూ బయటకు పరుగెత్తిందామె.

7

సునంద చెప్పినదంతా వినేసరికి ఆశ్చర్యంతో తల మునకలయిపోయాడు లాయర్ రఘు.

డైనింగ్ హాలులో ఆ సంఘటన జరిగాక, మరో నిముషంసేపు కూడా ఆ ఎస్టేట్ లో ఉండలేకపోయిందామె. భర్తతో చెప్పి డ్రైవర్ ను తీసుకుని జయపూర్ కు వెళ్ళిపోయిందామె. అయితే ఆమె వెళ్ళింది తమ బంగళాకు కాదు. లాయర్ రఘు ఇంటికి.

భర్తకు యెంత ప్రామిస్ చేసినా, ఇప్పుడు నాగమణి చావును గూర్చి యెవరో ఒకరికి చెప్పకోవాలి. తప్పదు.

తన గుండెల్లో భారాన్ని దింపుకోవడానికి, భయంతో అనుక్షణం తల్లడిల్లిపోతున్న తనను అర్థం చేసుకోవడానికి తనతో తోడు కావాలి. దురదృష్టవశాత్తు ప్రాణానికి ప్రాణంగా ప్రేమించిన భర్త తన మాటలను నమ్మటం లేదు. కేవలం భయం అని తేలిగ్గా కొట్టి పారేస్తున్నాడు.

రఘు కేవలం తన ఫ్యామిలీలాయర్ మాత్రమే కాదు. చిన్నప్పటి నుండీ కలసి చదువుకున్నారు వారు. వారిద్దరూ మంచి స్నేహితులు కూడాను. అందుకే తన మనసులోని ఆందోళను రఘుతో చెప్పుకుంది ఆమె.

సునంద వెళ్ళిపోయాక, ఆమె చెప్పిన విషయాలను మరోసారి నెమరు వేసుకున్నాడు రఘు. ఇంతవరకూ జరిగిన సంఘటనలను క్రోడీకరించుకుంటూపోయా డతడు. అతని చేతిలోని కలం లెటర్ పాడ్ పై చక, చకా పాయింట్స్‌ను వ్రాసుకుంటూ పోసాగింది.

1. దివాకర్ ఆస్తికోసం సునందపై పగబట్టాడు.
2. తాంత్రిక విద్యల ద్వారా సునందపై యేదో ప్రయోగం చేయించడానికి ప్రయత్నించాడవాడు....
3. తాంత్రిక పూజ తరువాత కోయదొర దివాకర్‌తో ఇలా అన్నాడు:

   'ఆ యమ్మకు ఎరికున్న తీవుదే వస్తది.'

   అంటే.... నాగమణి దయ్యాన్ని ...ఆ కోయదొర సునందపై ప్రయోగించాడా....?
4. నాగమణి నిజంగా దయ్యమేనా....?
5. నాగమణి చావును తాము కళ్ళారా చూశామంటోంది సునంద.

6. నాగమణిది హత్యా? ఆత్మహత్యా?
7. డైనింగ్ హాలులోని సంఘటనలను పరిశీలిస్తే అవి మామూలు మనుషులు కూడా సులువుగా చేయగలరు. డ్రైవర్ తెచ్చిన కారేజ్ లోని పదార్థాలను గాక వేరే పదార్థాలను సునంద వచ్చేసరికి డిషెస్‌లో వడ్డించి వుంది. ఆమె భయంతో పారిపోగానే, ఆ పదార్థాలన్నింటిని తీసి వేసి ఆ పింగాణీ పాత్రలను గుడ్డతో శుభ్రం చేసి ఉంచవచ్చు.

ఎందుకంటే: సునంద తన భర్త విజయ్‌తో కలసి డైనింగ్ హాలులోకి తిరిగిరావడానికి ఐదు నిముషాలకు పైనే పట్టిందని చెప్పింది. ఆ మాత్రం వ్యవధి చాలు ఆ ఖాళీ డిషెస్‌ను అమర్చడానికి.

అలాగే నేప్‌కిన్ విషయంలో కూడా.
8. ఇది మనుషులు ఆడుతున్న నాటకమే అయితే చనిపోయిన నాగమణి డైనింగ్ హాలులో ఎలా ప్రత్యక్షమయింది?
9. ఒక వేళ చనిపోయిన నాగమణి వేషంలో ఇంకెవరైనా నటిస్తున్నారా? ఏ ప్రయోజనం కోరి ఎవరు ఆ నాటకాన్ని ఆడిస్తున్నారు?

దివాకరా?

ఎందుకంటే సునందకు కీడు చేయడం ద్వారా ప్రయోజనాన్ని ఆశిస్తున్న దతడు మాత్రమే.
10. దివాకర్ ఈ నాటకాన్ని ఆడిస్తుంటే.... అతడు సునందపై ప్రయోగిస్తున్నది మనిషిని కాదు, దయ్యాన్ని. నాగమణి మనిషయితే విజయ్‌కు ఎందుకు కనిపించదు?

అతడు ఇప్పుడు మొదట వ్రాసిన ఆరు పాయింట్లను

చివరకు తెచ్చాడు. తను వ్రాసినదంతా అమూలాగ్రం చదివాడు.

ఎక్కడ వేసిన గొంగళి అక్కడే ఉన్నట్లనిపించిం దతనికి. యేదే యేమైనా నాగమణి యెవరో ముందుగా తెలుసుకోవాలి. ఆమె పూర్తి వివరాలు తెలిస్తేగాని ఈ కేసులోని మిస్టరీ విడివడదు.

ఆ నిర్ణయానికి వచ్చిన మరుక్షణం అతడు లెటర్ పాడ్ ను మూసి, లేచి నిలబడ్డాడు.

8

పాడేరు స్టాండ్ లో బస్సు ఆగింది. మెల్లగా బస్సు దిగాడు రఘు. అతని భుజానికి చిన్న ఎయిర్ బ్యాగ్ వ్రేలాడుతూంది.

'తాను పాడేరులోని ఎలిమెంటరీ స్కూల్లో టీచర్ గా పనిచేస్తున్నానని' తనతో నాగమణి చెప్పినట్లు సునంద చెప్పింది. నాగమణి గురించి తెలుసుకోవడానికి అతని కున్న ఆధారమల్లా అదొక్కటే. అందుకే పాడేరు ప్రయాణమయ్యాడతడు.

పాడేరు గిరిజన ప్రాంతం. కొండలూ, అడవుల మధ్యనున్న చిన్న ఊరు. పల్లె చిన్నదే అయినా ఇటు సీలేరు, అటు మాడుగుల పోయే రోడ్డుకూడలి కావడంతో ఆ గిరిజన వాడల్లోకూడా అక్కడక్కడ నాగరికతా చిహ్నాలు కన్పిస్తున్నాయి.

ఎలిమెంటరీ స్కూలును కనుక్కోవడం పెద్ద కష్టం కాలేదు అతనికి. కాని ఆ స్కూలు హెడ్ మాస్టర్ చెప్పిన సమాధానం విన్నాక అతను తెల్లబోయాడు.

'నాగమణి పేరుగల అమ్మాయెవరూ ఆ స్కూల్లో

పనిచేయడంలేదు. అసలు గత రెండు సంవత్సరాలుగా ఆ స్కూల్లో లేడీ టీచర్సే లేరు.'

నాగమణిని గూర్చి తెలుసుకోవడానికి తనకున్న ఒకే ఒక్క ఆధారమూ పోయేసరికి అతడికి ఏం చేయాలో తోచలేదు. నిరాశగా కాళ్లీడ్చుకుంటూ బస్టాండువైపు నడిచాడు.

టీ బంక్ ముందున్న చిన్న చెక్క బల్లమీద కూర్చున్నాడతడు. ఒక 'స్ట్రాంగ్ టీ' అని చెప్పాడు. కాకీ నిక్కరు మాత్రం వేసుకున్న చిన్న కుర్రాడు 'టీ' గ్లాసును అందించాడతడికి. టీని త్రాగుతూ ఆలోచనల్లో మునిగిపోయాడతడు.

ఈ కేసులో యెలా ప్రొసీడ్ కావాలో అర్థం కావటంలేదతనికి.

సరిగ్గా అదే సమయంలో అతని ఆలోచనలను చెదరగొడుతూ 'బోయ్' మంటూ బస్సు హారన్ వినిపించింది. తలెత్తి చూసాడతడు.

"వైజాగ్ .... వైజాగ్ ...." అంటూ బస్సు క్లీనరు కేకలు పెడుతున్నాడు.

వైజాగ్ అన్న మాట విన్న వెంటనే తన మెదడులో బల్బు వెలిగినట్లనిపించింది రఘుకు.

"దివాకర్ చదువుతున్నది వైజాగ్‌లో. దివాకర్‌కూ నాగమణికీ యేదైనా సంబంధం వుందా? లేదా? అన్నది తేలాలంటే వైజాగ్‌లో ఎంక్వయిరీ చేస్తే సరి."

ఆ ఆలోచన వచ్చినందుకు తనను తాను అభినందించుకుంటూ బస్సువైపు నడిచాడు రఘు.

అదే సమయానికి తన గుడిసెలోని ముగ్గు మధ్య కూర్చుని ప్రేతాత్మను ఆహ్వానించడానికి సర్వం సిద్ధం

చేస్తున్నాడు కోయదొర. ఆ గుడిసెలోనే ఒక మూల ఒద్దికగా కూర్చుని అతడు చేస్తున్న పూజా విధానాన్ని ఆసక్తిగా గమనిస్తున్నాడు దివాకర్.

ప్రేతాత్మలకు స్వాగతం పలుకుతూన్నట్లు మసక చీకట్లు ముసురుకోసాగాయి. ఆకాశంలో గుమిగూడుతున్న పిశాచాల్లా కారుమబ్బులు క్రమ్ముకోసాగాయి. భూమ్యాకాశాలను రెండుగా చీల్చేస్తున్నట్లు ఉరుములూ, మెరుపులూ ప్రారంభమయ్యాయి. కొండలనూ, అడవినీ ముంచెత్తుతూ వర్షం కుండపోతగా కురియసాగింది.

భూమి, ఆకాశం, నీరు, గాలి, అగ్ని అనెడి ఈ పంచభూతములూ, పాంచభౌతికమైన దేహాన్ని విడిచి వచ్చిన ఆత్మలకే సహాయపడతాయంటారు.

ఏమో! అది నిజమే నేమో! అనిపించింది దివాకర్ కు ఆ వర్షాన్ని చూస్తుంటే. కోయదొర ఉచ్చరిస్తున్న మంత్రాలు ఆ ప్రళయ భీకరమైన వర్షపు హోరులో కలిసిపోతున్నాయి.

9

మంచంపై అసహనంగా అటూ, ఇటూ దొర్లసాగింది సునంద. వర్షం అంటే చిన్నతనంనుండీ సునందకు తగని చిరాకు. అందులో హోరు గాలితో ధారాపాతంగా కురుస్తున్న ఈ వర్షం ఆమెలో యేదో అనీజీనెస్ను కలుగజేస్తూంది.

బెడ్ రూమ్కు ఎదురుగా వున్న స్టడీ రూంలో కూర్చుని వున్నాడు భర్త విజయ్. అతని ముందున్న ఎక్కౌంట్స్ పుస్తకాలలో మునిగిపోయాడతడు.

డ్జెట్ దేకస్తూంది కాంటి ఎక్సైజ్ వారి కోసం, ఎస్టేట్ ఎక్కౌంట్సన్నీ అప్టుడేట్ గా వుంచాలి. అందుకే

అరుణ వెళ్ళి వచ్చినప్పటినుండీ పీకలదాకా పనిలో మునిగి పోయాడతడు.

ఎత్తయిన అద్దాల కిటికీలనుండి కనిపిస్తున్న తోటలోని వృక్షాలు జుత్తులు విరబోసుకొని వర్షంలో స్నానం చేస్తున్న పిశాచాల్లా వున్నాయి. ఎదురుగా భర్త కనిపిస్తున్నా యేదో తెలియని ఒంటరితనం ఆమెను పీడించసాగింది.

అదే సమయంలో ఆ భవంతిలోని దీపాలన్నీ ఆరిపోయాయి. అంతటా చిక్కని చీకటి క్రమ్ముకుంది.

'కరెంట్ పోయింది కాబోలు' అనుకుందామె. కానీ అది ఎలక్ట్రిసిటీ ఫెయిల్యూర్ కాదని, కేవలం తమ భవనంలోని దీపాలు మాత్రమే ఆరిపోయాయని ఆమెకు తెలియదు.

చీకటిలో చూడటానికి ఆమె కళ్ళు అలావాటుపడటానికి కొద్ది క్షణాలు పట్టింది ఆమెకు. ఎవరో త్రోసినట్లు ఆ బెడ్ రూమ్ తలుపులు విసురుగా తెరచుకున్నాయి. రివ్వుమంటూ చల్లని గాలి ఆ గదిలోనికి ప్రవేశించింది.

అప్పుడు చూసిందామె ఆ గదిలోకి అడుగు పెడుతున్న తెల్లని ఆకారాన్ని. విసు గా వీస్తున్న గాలికి ఆమె విరబోసుకున్న కురులు, తెల్లని చీర చెంగు గాలిలో లేచిపోతుంటే....అస్పష్టంగా వున్న ఆమె ఆకారం గాలిలో తేలివస్తున్నట్లు వుంది.

ఆమె తలచుట్టూ కిరీటంలా యేదో చుట్టబడి వుంది. అందులో నుండి మిణుకు, మిణుకు మంటూ ఎర్రని కాంతులు చిమ్ముతున్నాయి. ఆ ఎర్రని కాంతిలో ముఖం స్పష్టంగా కనిపిస్తోంది. వికృతంగా నవ్వుతున్న ఆమె పెద

వులు వంకరలు తిరిగివున్నాయి.

ఆమె.... నాగమణి.

“సునందా....! రా....సునందా....వచ్చేయ్!”

ఆ నీరవ నిశీధిలో ఆమె గొంతు తన చెవిలో నే గుస, గుసలాడుతున్నట్లు వినిపించింది సునందకు.

‘కెవ్వ్’ మంటూ కేక వేసిందామె.

అరచేతిని రెండు కళ్ళకు అడ్డు పెట్టుకొని భయంతో వణికిపోతూ కళ్ళను గట్టిగా మూసుకొంది సునంద.

అదే సమయంలో చేతిలోని టార్చిలైట్ తో ఆ గది లోకి పరుగెత్తుకొని వచ్చాడు విజయ్ ఎలక్ట్రిసిటీ ఫెయి లయిన వెంటనే డెస్క్ లో వున్న టార్చిలైట్ ను తడుము కుంటూ వెలికి తీశాడు అతడు. సెల్ ను ఫీట్ చేసేసరికి సునంద కేక వినిపించిందతనికి.

ఆత్రుతగా భార్య పడుకొని వున్న బెడ్ ను సమీపిం చాడు. “వాట్ హాపెండ్ డార్లింగ్. సునందా.... సునందా యేదీ కళ్ళు తెరు. అరె ... సినోయ్” అంటూ కళ్ళకు అడ్డంగా పెట్టుకున్న ఆమె చేయిని తొలగించాడు.

భర్త గొంతువిన్నా ఆమెలో భయం పోలేదు. మెల్లగా సంకోచిస్తూ కళ్ళు తెరచింది. ఎదురుగా తనను పొదివి పట్టుకున్న భర్త.

“అక్కడ....అక్కడ నాగమణి....దె....య్యం వుందండి” తలుపువైపు చేయి చూపిస్తూ వణుకుతున్న గొంతుతో అందామె.

“ఏదీ” అంటూ అటు టార్చిని ఫోకస్ చేశాడతడు. ద్వారానికి వ్రేలాడుతున్న తెల్లని డోర్ కర్టెన్ గాలికి యెగురుతూ కనిపించింది వారికి.

“డోర్ కర్టెన్ ను చూసి దయ్యమనుకున్నావా.

గొప్ప భాగ్యవంతురాలినే" పక, పకా నవ్వుతూ అన్నాడు విజయ్.

తను చూస్తున్నది కలో, నిజమో అర్థంకాలేదు ఆమెకు. భర్త వంక బేలగా చూసిందామె.

"సునందా .... యిక్కడున్నాను సునందా.... యిక్కడ."

ఎవరో తన చెవి దగ్గరే మెల్లగా అనడంతో తృళ్ళిపడి చూసిందామె. బెడ్ కు అవతల ప్రక్క ఆమె తలభాగం వైపు నిలుచుని వుంది నాగమణి. ఆమె పెదవులపై అదే వికృతహాసం.

భర్త చేతిని గట్టిగా పట్టుకొని నాగమణివైపు చేయి చూపించిందామె. ఈసారి ఆమె నిలువెల్లా వణికిపోతూంది. "అదిగోండి. అక్కడ.... నా బెడ్ ప్రక్కనే."

టార్చ్ ని అటు ఫోకస్ చేశాడతడు.

"ఎక్కడోయి. నా కెవరూ కనిపించరేం?"

భర్త మాటలకు మళ్ళీ అటు తల త్రిప్పి చూసిందామె. నాగమణి అక్కడే నిలుచుని వుంది. ఆమె మెల్లగా పెదవులు కదల్చింది.

"వచ్చేయ్ సునందా. ఇటు వచ్చేయ్."

"అదిగోండి....ఆ దయ్యం అక్కడే వుంది."

కన్నీళ్ళతో ముఖం తడిసిపోతుంటే బావురుమంది ఆమె.

"ఛ....ఛ....ఏంటది చిన్నపిల్లలా. సునందా మై డార్లింగ్ .... ఊరుకో .... ఏడుపు ఆపేయాలి మరి. నీ వెంతుకో ఊరికే భయపడుతున్నావోయ్. ఏదీ మరి నాకే దయ్యమూ కనిపించడంలేదేం? అయినా నేను ప్రక్కనే ఉన్నాగా. ఇంకా భయమెందుకు?"

అంటూ ఆమెను అనునయిస్తూ మెల్లగా బెడ్ పై పరుండబెట్టాడు. అప్పటికే మానసికంగా బాగా అలసి పోయింది ఆమె. నిస్త్రాణంతో కనురెప్పలు మూతలు పడుతున్నాయి. భర్తకు "గుడ్ నైట్" చెబుదామని కళ్ళు తెరిచి అతనున్న వంక చూసిందామె.

అంతే! భయంతో చిగురుటాకులా కంపించిపోయిందామె. అక్కడ అన్నది ఆమె భర్త విజయ్ కాదు. నాగమణి.

భయంతో ఆమె వేసిన కేక గొంతులోనే వుండిపోయింది. అంత చలిగా వున్న వాతావరణంలోనూ ఆమెకు నిలువెల్లా చెమటలు పట్టాయి. వడలిపోయిన తీగలా అలాగే ఆ బెడ్ మీదే మూర్ఛపోయింది ఆమె.

10

వైజాగ్ లో చదువుకుంటున్న రోజులలో తాను దాబా గార్డెన్స్ లో వుంటున్నట్లు—ఏదో మాటల సందర్భంలో చెప్పాడు దివాకర్, లాయర్ రఘుతో.

కాని దాబా గార్డెన్స్ సెంటర్ లో నిలబడి చుట్టూ ఒక్కసారి పరికించి చూశాక, దివాకర్ ఎడ్రస్ సంపాదించడం తాను అనుకున్నంత సులువేమీ కాదనిపించింది రఘుకు.

అయితే అతడి లాయర్ బుర్ర తెలివిగానే పని చేసింది. సాధారణంగా స్టూడెంట్స్ కు గదులు అద్దెకివ్వడానికి ఎవరూ యిష్టపడరు. కేవలం స్టూడెంట్స్ కోసమే ఒక యింటిని కేటాయించి అందులోని చిన్న, చిన్న గదులను ఇద్దరు ముగ్గురు స్టూడెంట్స్ కు కలిపి అద్దెకిస్తుంటారు కొందరు అయితే అలాంటివారు చాలా అరుదు.

అలాంటి యిళ్ళగూర్చి వాకబు చేసుకుంటూ పోయా

డతడు డాబా గార్డెన్స్‌లో అలా స్టూడెంట్స్‌కోసం రూమ్స్‌ను అద్దెకిచ్చే యిళ్ళు మూడు అని తెలిసింది. ఒక్కొక్క ఇంటిలో ఎంక్వయిరీ చేసుకుంటూ పోయా డతడు. తనతో దివాకర్ ఫోటో లేవడంచేత అతని పని మరింత సులువైంది.

కాని అతడు ఊహించినట్లుగా దివాకర్ ఆ మూడిళ్లలో ఎందులోనూ అద్దెకు ఉండలేదు. మూడవ యింటికూడా వాకబుచేసి నిరాశగా వెనుదిరిగి వస్తున్నాడతడు.

పిట్టగోడకున్న చిన్న చెక్కగేటును తోసుకొని బయటకు అడుగుపెట్టే సమయంలో అతడిని రాసుకుంటూ పోయాడు పదిహేనేళ్ళ కుర్రాడు. ఎదురుగావున్న హోటల్ నుండి వస్తున్నాడా అబ్బాయి. అతడి చేతిలోని వైరుతో అల్లిన హేంగర్లో టీ గ్లాసులున్నాయి. ఆ యిట్లోని స్టూడెంట్సుకు టీలుగట్రా సప్లై చేస్తుంటా డతడు.

ఆ కుర్రాడి వంక విసుగ్గా చూసి రెండడుగులు ముందుకు వేసాడు రఘు. అతని కెందుకో తన చివరి ప్రయత్నంగా ఆ కుర్రాడిని దివాకర్ గూర్చి అడుగుదా మనిపించింది.

'ఏమో! ఎవరికి తెలుసు. వాడేమైనా చెప్పగల డేమో! అసలు స్టూడెంట్స్ గురించి కరెక్టు ఇన్ఫర్మేషన్ ఇవ్వగలిగేది వాళ్ళ పనులు చేసే యిలాంటివారే.'

రఘు తన ఆలోచనల్లో వుండగానే ఆ కుర్రాడు స్టూడెంట్సుకు 'టీ'లు సప్లై చేసి వచ్చేశాడు. ఆ కుర్రా డిని చేయిపట్టుకు ఆపాడతడు.

“చూడు బాబూ” అన్నాడు రఘు.

"నా పేరు మూడు బాబూ కాదండి సూరిబాబు" అన్నాడా కుర్రాడు టక్కున.

చాకులాంటి కుర్రాడే అనుకున్నాడతడు. తన జేబు లోని దివాకర్ ఫోటో తీశాడు. ఆ కుర్రాడికి చూపించాడు.

"సూరిబాబూ.... ఈ ఫోటోలోని అబ్బాయిని నీవెప్పుడైనా చూశావా?"

ఒక్క క్షణం దీక్షగా ఆ ఫోటో వంక చూశాడతడు.

"చూశానండి. దివాకర బాబుగారు కదండి".

"ఈయన నీకు తెలుసా" ఆత్రంగా అడిగాడతడు.

"తెలుసుకుంటే తెలుసుకదండి. ఇక్కడ స్టూడెంట్ కుర్రాళ్ళందరూ తెలుసండి."

"దివాకర్ ఎక్కడుండేవాడు?"

"అదిగోనండి ఆ రావిచెట్టు కనబడుతుందండి. దాని యెదురుగా వున్న యింట్లో వుండేవారండి. ఆ రావిచెట్టు క్రిందే ఈ టీ కొట్టు వుండేదండి. రావిచెట్టు అక్కడే వుందండి. టీకొట్టు మాత్రం యిక్కడకు వచ్చేసిందండి."

"వీడు వాగుడుకాయ కూడాను" అనుకున్నాడు రఘు.

"పోనీ ఆ యిల్లు అయినా ఉంది కదా" అన్నాడు నవ్వుతూ.

"ఇల్లు ఉందండి, కానీ యింటాయన లేరండి! యిల్లు అమ్మేసి ఉత్తరాదెల్లి పోయారండి."

ఆ కుర్రాడి మాటలకు హతాశుడైపోయాడు రఘు. దివాకర్ గూర్చి చెప్పగలిగే ఆ ఒక్క యిల్లుగలాయన యెక్కడికో పోయారట. ఏమిటి చెయ్యడమని క్షణంసేపు ఆలోచించాడు. గాలిలోకి బాణంలా నాగమణిగూర్చి

కూడా వీడినే అడిగేస్తే సరి అనుకున్నాడతడు.

"సూరిబాబూ.... దివాకర్ కు గర్ల్ ఫ్రెండ్స్ యెవరయినా ఉండేవారా....?"

"సినిమాల్లోనయితే ఇట్లాంటి ప్రశ్నలు ఊరికినే యెవరూ అడగరండి" తల గోక్కుంటూ అన్నాడు సూరిబాబు.

'హారి పిడుగా....' అనుకుంటూ జేబులోనుండి ఐదు రూపాయల నోటును తీసి అతడి చేతిలో పెట్టాడతడు.

ఆ నోటును చూసిన వెంటనే వాడికి ఎక్కడలేని ఉషారూ వచ్చేసింది. ఇక గడ, గడా వాగడం మొదలు పెట్టాడు.

"ఒకమ్మగోరుండే వారండి. సానా అందంగుంటారండి. ఎప్పుడూ సెంటర్లోనే ఇద్దరూ కలుసుకోనే వారండి. బస్టాప్‌లో అమ్మగారు నిలబడితే నేను వరుగ తీసికెళ్ళి దివాకర్ బాబుగారితో అమ్మాయిగారొచ్చారని చెప్పేవాడినండి. అమ్మాయిగోరు అప్పుడప్పుడు రూపాయిచ్చేవారండి."

"అంటే వారిద్దరూ ప్రేమించుకున్నారా.... ఐ మీన్ చాలా క్లోజ్. అంటే ఒకరికొకరు దగ్గరగా ఉండేవారా?" ఆ ప్రశ్న ఆ కుర్రాడిని ఎలా అడగాలో తెలియక తానే సతమతమయ్యాడు రఘు.

కుర్రాడు మాత్రం టక్కున జవాబిచ్చాడు.

"ఓసారి ఇంటాయన ఊరికెళ్ళినప్పుడండి, అమ్మాయిగార్ని, దివాకర్ బాబు తీసుకువచ్చేశారండి. గదిలోకి వెళ్ళాక తలుపు వేసుకున్నారండి. అంటే ప్రేమించడానికే కదండి"

"మరి ఆ అమ్మాయిగారి పేరేమిటన్నావు సూరి

బాబూ!" చాలా క్యాజువల్‌గా అడిగాడు రఘు. కాని అతని గొంతులోని క్యూరియాసిటీని అవ్రాడు పైతం కనిపెట్టేశాడు.

"ఇంకా అనలేదండి. ఇప్పుడంటానండి. అమ్మాయి గారు పేరు.... పేరండి...."

అంటూ అతడి జేబువైపు మళ్ళీ ఆశగా చూశాడు సూరిబాబు.

'శ్రీరి నీ సినీ పరిజ్ఞానం దొంగలు తోలా' అనుకున్నాడు రఘు. జేబులోనుండి మరో ఐదురూపాయల నోటుతీసి అతడి చేతిలో పెట్టాడు. అది చేతిలోపడ్డ మరుక్షణం సూరిబాబు అమ్మాయిగారి పేరు చెప్పాడు.

ఆ పేరు విన్న వెంటనే....రఘు ముఖం ఒకవిధమైన విజయగర్వంతో వెలిగిపోయింది. తాను ఊహించినదే కరెక్టయిందన్న భావం అతడి పెదవులపై చిరునవ్వయి విరిసింది.

దివాకర్ ప్రేమించిన అమ్మాయి పేరు ....నాగమణి.

11

"నాగమణి యిప్పుడెక్కడుంది దివాకర్?"

ఆ ప్రశ్నకు ప్రక్కలో బాంబు పడ్డట్టు ఉలిక్కిపడి లాయర్ రఘు వంక చూశాడు దివాకర్.

ఆ అమ్మాయి పేరు నాగమణి అని తప్ప, ఆమెగూర్చి మరే వి వ రా లూ చెప్పలేకపోయాడు సూరిబాబు. నాగమణి, దివాకర్‌లగూర్చి మరే వివరాలనూ అక్కడ సంపాదించలేనని ధృవపర్చుకున్నాక వైజాగ్ నుండి వచ్చేశాడు రఘు.

సునందను భయపెడుతున్న దయ్యం....నాగమణి అని తెలిశాక, నాగమణి దివాకర్ ప్రియురాలని తేలి

పోయాక. ఇక ముసుగులో గుద్దులాట లేకుండా దివాకర్‌తో తాడో, పేడో తేల్చుకోవడం మంచిదనిపించింది అతనికి. అందుకే తిన్నగా వెళ్ళి దివాకర్‌ని కలిసాడతడు.

"నాగమణి ఎవరు?" ఆశ్చర్యం నటించాడు దివాకర్.

"నీ మాజీ ప్రియురాలు దివాకర్. కాలేజ్ చదివే రోజులలో డాబా గార్డెన్స్‌లో ఉన్నప్పుడు పూసుకొని తిరిగావే ఆ నాగమణి."

"ఏమో నాకేం తెలుసు. అప్పుడేదో కొన్నాళ్ళు కలసి తిరిగాం. కాలేజ్ అయిపోయాక నేను జయపూర్ వచ్చేసాను. ఇన్నేళ్ళ తరువాత ఇప్పుడు నాగమణి ఎక్కడుందంటే ఏం చెప్పమంటారు?"

విసుగ్గా చూశాడు దివాకర్.

"పోనీ నాగమణి అప్పుడెక్కడ ఉండేది దివాకర్?"

"అసలు మీకీ వివరాలన్ని ఎందుకు?" చిరాగ్గా అన్నాడతడు.

"చెలుతాను దివాకర్. ముందు నా ప్రశ్నకు సమాధానం చెప్పండి"

"చెప్పకపోతే" రెట్టించాడతడు.

"మీకే నష్టం. కోరి ఒక హత్యలో ఇరుక్కోవడం యెవరికీ ఇష్టం ఉండదు కదా" కూల్‌గా దివాకర్ కళ్ళలోకే చూస్తూ అన్నాడు రఘు.

రఘు వంక కలవరంగా చూశాడు దివాకర్.

"మీరంటున్నదేమిటో నాకర్థం కావటంలేదు" అన్నాడు మెల్లగా.

"అర్థమయ్యేలే చెబుతాను. ముందు జవాబు చెప్పండి."

"నాగమణి యేదో ప్రైవేట్ ఫర్మ్‌లో టైపిస్టుగా

పని చేస్తుండేది. వారి స్వగ్రామం కాకినాడట. వైజాగ్ లో వర్కింగ్ వుమెన్స్ హాస్టలులో వుండేది. ఏదో సరదా కోసం ఆమెతో కలసి తిరిగాను కాబట్టి ఆమె మిగిలిన వివరాల జోలికి పోలేదు - ఆమెతో ఎఫైర్ అక్కడితో త్రెంచుకోవడమే నా ఉద్దేశం కాబట్టి. వైజాగ్ నుండి వచ్చేసేటప్పుడు కనీసం ఆమెను కలువకుండానే వచ్చేశాను."

ఇంక చెప్పాల్సిందేమీ లేదన్నట్లు ఆగాడు దివాకర్.

"కానీ.... నాగమణే మీకోసం జయపూర్ రావచ్చుగా" అన్నాడు రఘు.

"ఆమెకు నా వివరాలేమీ చెప్పలేదు రఘూ. మాది బొంబాయి అని చెప్పాను ఆమెకు. ఇప్పుడు చెప్పాండి యేమిటి యేదో హత్య అన్నారు."

"మీకు నిజంగా తెలియదా?" కవ్వించాడు రఘు. అతడి వంక తీవ్రంగా చూశాడు దివాకర్.

"నాగమణి చనిపోయింది దివాకర్."

నమ్మలేనట్లు చూశాడు దివాకర్. అతడి ముఖంలో షాక్ వలన వచ్చిన ఆశ్చర్యం కొట్టవచ్చినట్లు కనిపించింది.

"ఎప్పుడు?" అతని గొంతులో యేదో ఆత్రం.

"ఆమెను హత్య చేసిన మీకే ఆమె యెప్పుడు చనిపోయిందో తెలియదంటారా?" అతని కళ్ళలోకే చూస్తూ అన్నాడు రఘు.

"వాట్ నాన్సెన్స్ ఆర్ యూ టాకింగ్....?" కోపంగా అరిచాడు దివాకర్.

"కూల్ డౌన్ మై ఫ్రెండ్. టేకిట్ ఈజీ. నిజం నేను చెబుతాను విను. ఎలాగో నీ అడ్రస్ సంపాదించింది నాగమణి. తనను పెళ్ళి చేసుకొమ్మని నిన్ను వత్తిడి చేసింది.

కాని నీ కన్ను సునందమీద, ఆమె ఆస్తిమీద వుంది. అందుకే గుట్టు చప్పుడు కాకుండా ఆమెను హత్యచేసి వదిలించుకున్నావు."

అతని ముఖంలోని భావాలను ఓరకంటితో గమనించసాగాడు రఘు.

"ఏదైనా పత్రికకు కథ వ్రాసి పంపు రఘూ బాగుంటుంది" వ్యంగ్యంగా అన్నాడు దివాకర్.

చిరునవ్వు నవ్వాడు రఘు.

"అన్నట్లు ఈమధ్య నాగమణి దయ్యమై వచ్చి రోజూ సునందను భయపెడుతూందట. నీకు తెలుసా?" యథాలాపంగా అన్నట్లు అన్నాడు రఘు.

ఆశ్చర్యంతో నోరు తెరిచాడు దివాకర్. అతన్ని చూస్తుంటే గొప్ప నటుడనిపించింది రఘుకు.

"మరీ అంతలా నటించనవసరంలేదు దివాకర్. నాగమణి చావును చూసిన వ్యక్తులున్నారు. చనిపోయిన నాగమణి వేషంలో ఇంకెవరినో పంపించి నీవాడిస్తున్న నాటకం నాకు తెలుసు.

నాగమణిని నీవే హత్య చేశావా, లేదా అన్నది తరువాత చూసుకొందాం. కాని ఈ నాటకాన్ని నీవింతటితో ఆపకపోతే నీవు తీవ్రమైన పరిణామాలను ఎదుర్కోవలసి వస్తుంది.

"లేమా, నిజంగా నాగమణి దయ్యమే నంటావా? అదీ చూస్తాను"—తీవ్రమైన కంఠంతో అన్నాడు రఘు.

ఆ మాటలకు కోపంగా ఊగిపోయాడు దివాకర్.

"రఘూ.... నా ఇంట్లోకి వచ్చి నన్నే బెదిరిస్తావా? నీకెంత ధైర్యం? నేనిప్పుడే నీమీద పోలీస్ కంప్లయింట్ యిస్తాను."

"నేను లాయర్ని దివాకర్. నాకు చట్టం నీకంటే బాగా తెలుసు."

గేటుదాకా వెళ్ళి వెనుతిరిగి చిరునవ్వుతో అన్నాడు రఘు.

రఘు వెళ్ళిన వంకే ఎర్రబడిన ముఖంతో చూస్తూ ఉండిపోయాడు దివాకర్. అయితే అతనికి ఒక్క విషయం ఆనందంగా ఉంది. అది తోయవోరద్వారా చేస్తున్న ప్రయోగం గురించి రఘుకు తెలియకపోవడం. ఇదంతా కేవలం మనుషులు ఆడుతున్న నాటకమని అనుకుంటున్నాడు అతడు.

'కాని ఇది ప్రేతాత్మ పని అని అతడికి తెలియదు' అనుకున్నాడు దివాకర్.

కాని, తను చేస్తున్న తాంత్రిక ప్రయోగం గురించి కూడా రఘుకు తెలుసని అతడికి తెలియదు.

12

రఘు ఊరినుండి వచ్చాడని తెలిసిన వెంటనే అతడిని కలుసుకుంది సునంద. వర్షం కురిసిన రాత్రి తన భయంకరమైన అనుభవమంతా అతడికి పూసగుచ్చినట్లు చెప్పింది.

"ఒకవేళ మిస్టర్ విజయ్ అన్నట్లు నీవు గాలికి ఎగురుతున్న ఆ వైట్ డోర్ కర్టెన్ను చూసి దయ్యమని భ్రమపడ్డావేమో సునందా!" అన్నాడతను.

"లేదు రఘూ.... నేను నాగవేణిని చాలా స్పష్టంగా చూశాను. అదీగాక ఈసారి ఆమె తలమీద మిణుకు మిణుకు మంటూ వెలుగుతున్న కిరీటం లాంటిది ధరించింది కూడానూ."

కొన్ని నిముషాలపాటు అతడు దీర్ఘాలోచనలో మునిగి

పోయాడు. అతని మనసులో నాగమణి మనిషేమో అన్న అనుమానం సునంద చెప్పిన ఆ వర్ణనతో బల పడింది.

నక్షత్రాకారంలో ఉన్న చిన్న చిన్న గాజు బల్బుల సీరియల్ సెట్‌ను నడుముకు ధరించి తిరగడం యిప్పుడు స్టూడెంట్స్‌కు క్రేజ్. పాకెట్ సైజు మినీ బ్యాటరీలవల ఆ బల్బులు వెలుగుతుంటే చీకటిలో చూసేవారికి అతని నడుముకు యేదో కాంతి వలయాన్ని చుట్టుకున్నట్లు గమ్మత్తుగా ఉంటుంది.

కాని.... ఆ ఫాషన్ యింకా ఢిల్లీ, బొంబాయి లాంటి నగరాలను దాటి మిగిలిన చోట్ల విస్తరించలేదు. నాగ మణి అలాంటి సెట్‌ను ధరించి సునందను భయపెట్టిందా? అంటే నాగమణి మనిషా?

లేక తన మానవాతీతమైన శక్తితో, ఆ ప్రేతాత్మ ఆ వింత కాంతివలయాన్ని సృష్టించిందా?

తన మనసులోని ఆలోచనలను అతడు సునందకు చెప్ప లేదు.

"ఒక్క రెండురోజులు ఓపికపట్టు సునందా! ఈ మిస్టరీని ఛేదించే బాధ్యత నాది" అన్నాడు రఘు.

ఇక వస్తానన్నట్లు లేచింది సునంద. ఆమెను గేటు వరకూ సాగనంపి వచ్చాడతను.

ఆ రోజు సాయంత్రమే నాగమణి ప్రేతాత్మ విషయం తేల్చెయ్యదలచుకున్నాడు అందుకోసం కోయదొర వున్న గూడెనికి ప్రయాణమవుతున్నాడు అతడు. చిన్న హాండ్ బాగ్‌లో తనకు కావాల్సిన వస్తువులన్నీ సర్దుకున్నా డతను.

కొన్ని నిముషాల తరువాత అతడు డ్రయివ్ చేస్తున్న

కారు కోరాపుట్ పోయే రోడ్డుమీద శరవేగంగా సాగి పోతోంది.

అదే సమయంలో....విజయ్, సునందలు తమ వైజాగ్ క్యాంపు కోసం బట్టలు సర్దుకొంటున్నారు.

రోజు రోజుకు భయంతో నీరసించిపోతూ, నెర్వస్ అయిపోతున్న సునందను విశాఖలోని మానసిక వైద్యునికి చూపించాలని నిశ్చయించుకొన్నాడు విజయ్. అందుకే ఈ ప్రయాణం.

ఈ ప్రయాణం సునందకు అట్టే ఇష్టంలేదు. కాని ఈ రూపంగానైనా కాస్త స్థలం మారితే కొంత మానసిక విశ్రాంతి లభిస్తుందని ఆశించిందామె. అందుకే ఈ ప్రయాణానికి అంగీకరించింది. అందులో ఆమె వైజాగ్ ఎప్పుడూ చూడలేదు కూడాను.

రఘు డ్రయివ్ చేస్తున్న కారు కోయదొర వుంటున్న గుడిసె ముందు ఆగే సమయానికి, జయపూర్ స్టేషన్ను విడిచిపెట్టి వాల్తేరువైపు సాగుతూ పోతోంది ప్యాసెంజరు ట్రయిన్. అందులోని ఫస్టుక్లాస్ కంపార్టులోని మెత్తని సీట్లలో కూర్చుని వున్నారు విజయ్ సునందలు.

ఆ ట్రయిన్ ఉదయం ఆరుగంటలకు వాల్తేర్ స్టేషన్ చేరుకుంటుంది.

13

తన గుడిసె ముందు ఆగిన కారులో నుండి దిగుతున్న రఘును ఆశ్చర్యంగా చూశాడు కోయదొర.

"మీతోనే పనుండి వచ్చాను దొరా!" అన్నాడు రఘు

నాగరికులు తన దగ్గరకు ఎందుకు వస్తారో ఆ కోయ దొరకు తెలుసు అతడు చిన్నగా నవ్వాడు.

గుడిసెలోనికి నడిచారు వారు. చిన్న చిరుచాపలమీద కూర్చున్నారు వారు.

“ఒక యువతిపై దయ్యాన్ని ప్రయోగించాలి దొరా” అన్నాడు రఘు.

రఘువంక ఒక్క నిముషంపాటు చూశాడు ఆ దొర. తనకు తెలిసినంతవరకూ యిలాంటి విషయాల్ని యింత సూటిగా చెప్పినవారు యెవరూ తనకు తారసపడలేదు.

“దానికి సానా ఖర్చు వుండాది సామీ” అన్నాడు దొర.

చిన్నగా నవ్వాడు రఘు. తన హేండ్ బాగ్ లో నుండి ఒక కాగితపు పొట్లాం తీశాడు. మెల్లగా ఆ పొట్లాన్ని విప్పాడు. అందులో పొడుగ్గా వున్న తల వెంట్రుక, కాన్ని గోళ్ళు ఉన్నాయి. వాటిని ఆ దొరకు అందించాడు.

“ఇవిగో నీకు కావాల్సిన ఆ యువతి వస్తువులు. ఇక డబ్బంటావా నీ కెంత కావాలో చెప్పు....” అన్నాడతడు.

అతనివంక ఆశ్చర్యంగా చూశాడు దొర.

“ప్రేతాత్మలకు ప్రీతికరమైన చీకటి క్రమ్మేసింది దొరా ఇక నీవు పూజ ప్రారంభించవచ్చు.”

జేబులో నుండి పర్సు తీసి వందరూపాయల నోట్లను యిన్ని తీసి, నిర్లక్ష్యంగా ఆ దొరకు అందించాడతడు. ఆ నోట్లను చూసిన వెంటనే ఆ దొరకళ్ళు ఆశతో మెరిసాయి. ఆత్రంగా వాటిని అందుకొన్నాడతడు.

తలారా స్నానం చేసి, దక్షిణదిశలో ముగ్గువేసి, ఆ

ముగ్గు మధ్య కూర్చున్నాడు దొర. యథావిధిగా ఆ కార్యక్రమాన్నంతా నెరవేరుస్తూ ఆ యువతి పేరు అడిగాడు అతిడు.

"సునంద" అన్నాడు రఘు.

ఫిర్నాకోలతో ఎవరో తన వీపుమీద చరిచినట్లయింది దొరకు అతడు విస్మయంగా చూశాడు.

"మరీ అంత ఆశ్చర్యంపోనవసరంలేదు దొరా! అదే పేరు గల యువతిమీద, నీవు దివాకర్ దగ్గర డబ్బు తీసుకుని దయ్యాన్ని ప్రయోగించావని నాకు తెలుసు.

ఆ దయ్యం వద్దులే. ఇంకో క్రొత్త దయ్యాన్ని ప్రయోగించు. రెండు దయ్యాలూ కలసి ఒకే అమ్మాయిని పీడిస్తుంటే భలే తమాషాగా ఉంటుంది కదూ!"

రఘువంక కోపంగా చూశాడు దొర. మౌనంగా పూజను పూర్తిచేశాడు. ఇక ముగ్గులోంచి నిలబడతాడనగా "దొరా!" అంటూ రఘు పిలిచాడు.

రఘువంక చూశాడతడు. హాండ్ బ్యాగ్ లో నుండి నిమ్మకాయలు, చిన్న చాకు, మానవాకారంలో చేయబడ్డ చిన్న పిండిబొమ్మ, హారతికర్పూరం, అగ్గిపెట్టె.... ఒక్కొక్కటీ తీసి మెల్లగా తన ముందు పేర్చాడు. ఆ వస్తువులను చూసిన కోయదొర కళ్ళు ఆశ్చర్యంతో పెద్దవయ్యాయి. దొరవంక చూసి చిరునవ్వు నవ్వాడు రఘు.

"ఏంలేదు దొరా! నీలాగే నేనూ పూజ చేస్తే ఆ దయ్యం నాకూ కనిపిస్తుందో లేదో చూద్దామని.... అంతే!"

అంటూ నిమ్మకాయను చేతిలోకి తీసుకొన్నాడు. కుడిచేత్తో చాకును పట్టుకొని "ఓం ఎ బి సి డి ఇ ఎఫ్.... నిమ్మ సఫా" అంటూ నిమ్మకాయను కోశాడు.

విచిత్రం! ఆ నిమ్మకాయ చెక్కలు ఎర్రగా రక్తపు ముద్దలులా వున్నాయి.

"అరె.... నాకూ మంత్రాలు వచ్చేశాయి దొరా. చూశావా నిమ్మకాయల్లో నుండి రక్తం వస్తూంది. అన్నట్లు నీకో రహస్యం చెప్పనా? అది రక్తం కాదు. నిమ్మకాయల్లోకి ముందే చిక్కని ఎర్ర సిరాను సిరంజ్ తో ఇంజక్ట్ చేశాను. బహుశా నీవు సింధూరాన్ని నీటిలో కలిపి ఎక్కిస్తావనుకుంటాను."

రఘు మాటలకు కోయదొర ముఖం వెల వెలా బోయింది ఓరకంటితో ఆ దొర ముఖంలోని భావాలను పరికించాడు రఘు.

ఆర చేతిలో హారతిని వెలిగించి "హాం.... హూం.... ఫట్ ...." అంటూ తన ముందున్న బొమ్మమీద వేశాడు. అంతే! కన్నులు మిరుమిట్లు గొలిపే కాంతితో ఆ బొమ్మ దగ్ధమై పోయింది.

"ఏమిటో నాకూ మంత్రశక్తి వచ్చేసినట్లుంది దొరా! బొమ్మ చూశావా యెలా కాలిపోయిందో? దీపావళికి మతాబులు కాలుస్తారు చూడు, ఆ మందుతో చేశాను దీన్ని. మెగ్నీషియమ్, సల్ఫర్ ల మిశ్రమం దొరా అది. నీకు తెలియదులే. అవునూ... నీవు దేంతో ఆ బొమ్మను తయారు చేస్తావు?" నవ్వుతూ అన్నాడు రఘు.

తన యెదురుగా కూర్చున్నది సామాన్య వ్యక్తి కాదని గ్రహించాడు కోయదొర. ఏమీ చేయలేని ఉక్రోషంతో అతడి ముఖం ఎర్రబారింది. అగ్నిలో ఆజ్యం పోసినట్లు రఘు మళ్ళీ పెదవి విప్పాడు.

"దయ్యం ఎప్పుడొస్తుంది దొరా!"

"ఇంతకూ యేమంటావు సామీ?" అసహనంగా

అన్నాడా దొర.

"అది మంచివారి లక్షణం దొరా. ఇప్పుడు అసలు కథకు వచ్చేద్దాం. నీవు చేసే గారడీలను శ్రద్ధగా నమ్మడానికి నేను దివాకర్ లాంటి వెంగళాయిని కాను. అది నీకు నిరూపించడానికే నీవు చేసే ట్రిక్స్‌ను నీ యెదుట నే చేసి చూపించాను.

"నీవు దయ్యాన్ని ప్రయోగించడమంతా వట్టి నాటకమని నాకు తెలుసు. కాని నిజం నీ నోటి వెంట నే వినాలని వచ్చాను.

"ఇప్పుడు నిజం నిజం చెప్పు దొరా! మళ్ళీ కాకమ్మ కథలు చెప్పడానికి ప్రయత్నిస్తే కటకటాల వెనుక ఉంటావు."

ఆ మాటలు విన్నంత నే రక్తం లేనట్లు తెల్లగా పాలిపోయింది కోయదొర ముఖం. పోలీసులు, కటకటాలు మాటతో భయంతో గజ గజ వణికిపోసాగాడతడు.

"ఏదో పొట్ట కూటికోసం తంత్రాలు చూపిస్తూ బతికే వోన్ని సామీ. మీ లాంటి సాముల దగ్గర కాసుల కాస పడి పూజలు సేత్తును" అన్నాడతడు దీనంగా.

"అంటే నీవు దయ్యాన్ని ప్రయోగించడం ...?" సాలోచనగా దొరవంక చూశాడు రఘు.

"అంత శక్తి నా కేవది దొరా! ప్రేతాన్ని పట్టి ఆడించే మంత్రగాళ్ళుం దేవారని వింటిని దొరా! కాని ఈ కంటితో కానలేదు" అన్నాడు దొర.

చిరునవ్వుతో తల పంకిస్తూ లేచాడు రఘు. కోయదొర వినయంగా అందించిన నోట్లను తీసుకొని పర్స్‌లో పెట్టుకొన్నాడు. కారు డ్రయివ్ చేసుకొంటూ పోతున్న రఘువంక రిలీఫ్‌గా చూశాడు దొర.

రఘుకు మాత్రం అంతా గజిబిజిగా వుంది. కోయదొర దెయ్యం ప్రయోగం అబద్ధమని తేలిపోయింది. అదే నిజమైతే సునందకు కనిపిస్తున్న దెయ్యం ఎవరు?

చనిపోయిన నాగమణి నిజంగా దెయ్యమై వస్తుందా? లేక నాగమణి వేషంలో యెవరో స్త్రీ....దెయ్యంలా నాటకం ఆడుతుందా?

అయితే దివాకర్ కోయదొర దగ్గరకు రావడం, పూజలు చేయించడం, కేవలం తమను తప్పుదోవ పట్టించడానికి ఆడుతున్న మరో నాటకమా?

అన్నీ ప్రశ్నలే! చిక్కు ముడులు పడిన ప్రశ్నలు.

14

రాత్రి పదకొండు గంటలు దాటింది.

ప్యాసింజర్ ట్రయిన్ అరకు స్టేషన్‌లో ఆగింది. ఫస్టు క్లాసు కూపేలో నిద్రపోతున్న సునంద ఉలిక్కిపడి లేచింది. గాఢంగా నిద్రపోతున్న తనను ఎవరో తట్టిలేపినట్లనిపించింది ఆమెకు.

"అరకు వచ్చింది. లే సునందా! నాతో రావూ?" అంటూ ఎవరో చెవిలో చెప్పినట్లనిపించిందామెకు. కన్నులు నులుముకుంటూ చుట్టూ చూసిందామె.

ఎదురుగా నవ్వుతూ నిలుచుంది నాగమణి.

అంతే! కెవ్వుమని కేక వేసిందామె. ఆమె కేక ట్రెయిన్ కూతలో కలిసిపోయింది. ట్రెయిన్ కదిలింది.

"రా....రా! సునందా!" అని నాగమణి చేతులు చాచింది.

"నో....నో....నో!" సునంద గొంతు బాధగా అరిచింది. ఇదేమీ తెలియని విజయ్ పక్క బెర్తుమీద గుర్రు పెడుతూ నిద్రపోతున్నాడు.

నాగమణి మెల్లగా ముందుకు కదలింది. భయంతో సునంద బిగిసిపోతోంది. చెవుల్లో భరించలేని హోరు. అదురుతున్న పెదవులు. చెమటతో ఒళ్ళంతా తడిసి ముద్దయిపోతోంది.

"వచ్చేయ్ సునందా!" మార్దవంగా వుంది నాగమణి గొంతు.

"ఏమండీ" డెస్పరేట్‌గా అరిచింది సునంద. కాని ఆమె గొంతు పెగలలేదు. అదే సమయంలో ఆమెమీదకు చేతులు చాచింది నాగమణి.

అంతే! భరించలేని టెన్షన్‌తో తల తిరిగి పోతోంటే అచేతనంగా అలాగే వెనక్కు వాలిపోయింది సునంద.

మళ్ళీ ఆమెకు తెలివి వచ్చేసరికి ఎదురుగా భర్త విజయ్ ఉన్నాడు. నాగమణి ఉందేమోనని బెదురుతూ చూసిందామె. కాని ఆ రూములో తామిద్దరూ తప్ప ఎవరూ లేరు.

ఉదయం ఐదుగంటల ప్రాంతంలో వాల్తేరు స్టేషన్‌లో దిగారు వారు. టాక్సీలో హోటల్ అప్సరాకు చేరుకున్నారు.

ఉదయం పదిగంటల సమయంలో బయలుదేరి వారు డాక్టర్ దగ్గరకు వెళ్ళారు.

'డాక్టర్ రుక్మిణి హిప్నోథెరపిస్టు'

అన్న నేమ్ ప్లేట్‌లోని అక్షరాలు చదివింది సునంద. ఉదయాన్నే రావడంచేత ఆ క్లినిక్‌లో వారు తప్ప వేరే పేషెంట్లెవరూ లేరు. అదీగాక, హిప్నోథెరపీ గురించి తెలిసిన వ్యక్తులు చాలా కొద్దిమంది ఉంటారు యీ దేశంలో.

ఎంతో జటిలమైన మానసికరోగాలను సైతం, మందుల సహాయం లేకుండా హిప్నోథెరపీ సహాయంతో నయం చేయవచ్చు. పాశ్చాత్య దేశాలలో ఎంతో ప్రాచుర్యాన్ని పొందిన ఈ మానసిక వైద్యవిధానం యిప్పుడిప్పుడే మన దేశంలో కూడా వెలుగులోనికి వస్తూంది.

వారు కన్సల్టింగ్ రూంలో ప్రవేశించారు. నీట్ గా సర్దబడి వుంది ఆ గది. ఓ మూలనున్న వాష్ బేసిన్ వద్ద నిలబడి చేతులు కడుక్కుంటోంది డాక్టర్ రుక్మిణి.

వారు ఆమెకు విష్ చేసి, కుర్చీలలో కూర్చున్నారు. డెట్టాల్ సోపును చేతులకు రాసుకుంటోందామె. వెనక తిరిగి చూడకుండానే "చెప్పండి" అంది ఆమె. డాక్టర్ వీపు భాగం మాత్రమే తనకు కన్పిస్తున్నా 'చిన్న వయసే' అనుకుంది సునంద. ఆమె అందమైన ఆకారాన్ని చూస్తూ.

అరకులో మొదటి సారి నాగమణి శవాన్ని చూసినప్పటి నుండి, యిప్పటివరకూ జరిగిన సంఘటనలన్నీ క్లుప్తంగా చెప్పాడు విజయ్ రాత్రి ట్రెయిన్ లో జరిగిన సంఘటనలతో సహా.

ఉదయం లేవగానే నాగమణి వచ్చి తనను యెలా భయకంపితురాల్ని చేసిందీ భర్తకు చెప్పుకొని ఏడ్చింది సునంద. విజయ్ ఆమెను అనునయించాడు. డాక్టర్ తో, లాయర్ తో కేసును గూర్చి చెప్పేటప్పుడు ఏ రహస్యం దాచకూడదని అతనికి బాగా తెలుసు. అందుకే యే చిన్న విషయాన్ని కూడా వదిలిపెట్టలేదు అతడు.

"సో... షి ఈజ్ సఫరింగ్ విత్ హాల్యూసినేషన్. అంటే ఆమె ఒకరకమైన భ్రాంతిలో ఉందన్న మాట. బహుశా నాగమణి శవాన్ని చూసిన షాక్ లో నుండి ఆమె పూర్తిగా తేరుకోలేదు. అందుకే దేనిని చూసినా

ఎవరిని చూసినా నాగమణే దెయ్యమయి వచ్చిందని ఆమె భయపడుతున్నారు."

టవల్‌తో చేతులు తుడుచుకొంటోందామె. డాక్టర్ గొంతు తనకు చిరపరిచితమైందిలా అనిపించసాగింది సునందకు. కాని విశాఖ రావడం, డాక్టర్ రుక్మిణిని కలుసుకోవడం జీవితంలో తనకు యిదే మొదటిసారి. మరి?....? సాలోచనగా డాక్టర్ వంకే చూస్తోంది సునంద.

టవల్‌ను హాంగర్ పై వేసి మెల్లగా వెనుతిరిగింది డాక్టర్.

అంతే! డాక్టర్‌ను చూసిన మరుక్షణం భయంతో కంపించిపోయింది సునంద. ఆమె వేసిన కేకకు ఉలిక్కి పడ్డాడు విజయ్....భర్త చేతిని గట్టిగా పట్టుకొంది ఆమె.

"నా....నా... గమణి....నాగమణండి" వణుకుతున్న చేయితో డాక్టర్‌ను చూపిస్తూ అందామె.

భార్యవంక విసుగ్గా చూశాడతడు. 'డోంట్ బి చైల్డిష్ సునందా! డాక్టరుగారిని పట్టుకొని యేమిటా మాటలు?" భార్యను మెత్తగా మందలించాడతడు.

"లేదండీ, ఆమె డాక్టర్ కాదు. నాగమణి. చూడండి ఎలా వికృతంగా నవ్వుతూందో."

తనవైపే వస్తూన్న డాక్టర్‌ను చూస్తూ కంపిస్తూన్న గొంతుతో అంది సునంద.

"చూశారా డాక్టర్! ఇదీ పరిస్థితి. చివరకు మిమ్మల్ని చూసి కూడా నాగమణే అనుకుంటోంది" అన్నాడు విజయ్.

"ఇట్సాల్ రైట్. ఈ రోగులకు ఇది మామూలే!

ఏదమ్మా నిన్నొకసారి టెస్టు చేయనీ" పూర్వకంగా పలికింది డాక్టర్ గొంతు.

తనను ముట్టుకోబోతున్న డాక్టర్ వంక పామును చూసినట్లు చూసింది సునంద.

"వద్దు....వద్దు....నన్ను తాకొద్దు ...నాగమణీ ప్లీజ్! నన్ను వదిలేయ్!"

ఆయాసంతో గుండెలు యెగిసి యెగిసి పడుతుంటే భయంతో వణికిపోతోంది ఆమె గొంతు. తెల్లగా రక్తం లేనట్లు పాలిపోయి వుంది ఆమె ముఖం. తెలియని భీతితో విప్పార్చుకున్న ఆమె కళ్ళ నుండి ధారగా నీళ్ళు కారుతున్నాయి.

డాక్టరు చేయి మెల్లగా ఆమె భుజంమీద పడింది.

అంతే!

"నో!" అని కంఠనాళాలు తెగేలా అరుస్తూ వెనక్కు విరుచుకుపడిపోయిందామె.

15

సునంద, విజయ్‌లు విశాఖ నుండి వచ్చేసారని తెలిసిన వెంటనే వారి బంగళాకు వెళ్ళాడు రఘు.

నిస్త్రాణగా మంచంమీద పడుకున్న సునందను చూసే సరికి బాధగా తోచింది రఘుకు. తను సరిగ్గా గమనించలేదుగాని, అరుకు నుండి వచ్చాక సునంద చాలా చిక్కిపోయింది.

లోతుకు పోయిన బుగ్గలు, గుంటలుపడ్డ కళ్ళల్లో అనుక్షణం కదలాడుతున్న భయం....భీతి. చేతులు చిక్కి తోటకూర కాడల్లా ఉన్నాయి. మెడమీద నరాలు కన్పిస్తున్నాయి. ఇదే స్థితిలో మరి కొన్నాళ్ళుంటే సునంద తమకు దక్కుతుందా....? అనిపించిం

దతనికి.

రఘును చూసిన వెంటనే ఆనందంతో సునంద కళ్ళు మెరిశాయి. ఈ ప్రపంచంలో తన్ను నమ్ముతున్నది రఘు ఒక్కడే. లేని ఓపిక తెచ్చుకొని, హీనస్వరంతో....తమ వైజాగ్ క్యాంప్ గురించి అంతా పూస గ్రుచ్చినట్లు చెప్పింది ఆమె.

ఆమె చెప్పిందంతా వినేసరికి అతడి తల తిరిగి పోయింది. సునంద నిజంగా భ్రాంతిలో ఉందేమోనన్న అనుమానం మొదటిసారిగా కలిగిందతడికి.

ఆమెకు ధైర్యం చెప్పి బయటకు నడిచాడతడు. ఆ రోజే అతడు విశాఖపట్టణం బయలుదేరాడు. డాక్టర్ రుక్మిణిని కలుసుకుంటే గాని ఆ మిస్టరీ ముడి విడేట్లు లేదు అనుకొన్నాడు.

నిజంగా డాక్టర్ రుక్మిణినే చూసి, నాగమణి అని సునంద భ్రమపడినట్లయితే....ఈ కేసు తేలిపోయినట్లే. ఆమెకు మంచి వైద్యం చేయిస్తే చాలు సరిపోతుంది అని అనుకొన్నాడతడు.

డాక్టర్ రుక్మిణి క్లినిక్ను క్లోజ్ చేసేసరికి రాత్రి ఎనిమిది గంటలు దాటింది. పేషెంట్స్ అందర్నీ చూసేసి క్లినిక్ మూసేయడానికి సిద్ధమౌతోంది డాక్టర్.

సరిగ్గా ఆ సమయంలో వెళ్ళాడు రఘు. అతని అభ్యర్థనను కాదనలేక పోయింది డాక్టర్ రుక్మిణి. సుమారు గంటసేపు మాట్లాడుకున్నారు వారిద్దరూ.

డాక్టరు మాటలను విన్నాక 'తనుగాని భ్రాంతిలో' లేను కదా అనుకొన్నాడు రఘు.

డాక్టర్ను చూసి సునంద....నాగమణి.....నాగమణి అని పిచ్చిగా అరచిందట. 'కాని క్లినిక్లో మూర్ఛ

పోలేదు ఆమె' అంటూంది డాక్టర్.

"అయినా మూర్ఛపోవడానికి ఆమె శరీరకంగా చాలా ఆరోగ్యంగా వున్నారు. ఎంతో ప్లెజెట్‌గా వున్న ఆమె కళ్ళు, నిండయిన బుగ్గలు. షి ఈజ్ పెర్‌ఫెక్ట్లీ హెల్తీ" అంది డాక్టర్ రుక్మిణి.

పీక్కు పోయిన బుగ్గలతో, గుంటలుపడ్డ కళ్ళతో వున్న సునందనను చూశాడు తాను. నిండయిన బుగ్గలతో ఆరోగ్యంగా సునంద ఉంది అంటూంది డాక్టర్. కేవలం పన్నెండు, పదహారు గంటల మధ్య మనిషి శరీరంలో అంత మార్పు ఎలా సంభవం?

అదే అర్థంకాక పిచ్చెక్కినట్లుంది అతనికి.

అదీగాక డాక్టర్ చెప్పిన మరో రెండు విషయాలు సునంద చెబుతున్న దానికి భిన్నంగా ఉన్నాయి.

ఒకటి: ఉదయం పదిగంటల ప్రాంతంలో డాక్టరు దగ్గరకు వెళ్ళామని చెప్పింది సునంద. అప్పుడెవరూ పేషెంట్స్ లేరనికూడా చెప్పిందామె. కాని....

సునందను ఆమె భర్త విజయ్ తన దగ్గరకు తీసుకొచ్చేసరికి పన్నెండు దాటిందని. వారిని చూశాక తాను మరో పేషెంట్‌ను మాత్రం చూసి లంచ్‌కు వెళ్ళానంటూంది డాక్టర్. వారు క్లినిక్‌కు వచ్చేసరికి కనీసం ఐదారుగురు పేషెంట్స్ ఉండవచ్చునంటుందామె.

రెండు: తాము కన్సల్టింగ్ రూమ్‌లోనికి ప్రవేశించేసరికి డాక్టర్ చేయి కడుక్కుంటోందని, అక్కడినుండే తాము చెప్పిందంతా విన్నదని— చెప్పింది సునంద.

కాని—

వారు వచ్చి, వెళ్ళేంతవరకూ మర్చిలోనుండి లేవ
నైనా లేదని చెబుతూంది డాక్టర్.

ఇది యెలా జరిగిందో అర్థం కావటంలేదు అతనికి. హాలూసినేషన్‌లో ఒకరిని చూసి ఒకరని, తనకేదో దయ్యం పట్టిందని.... ఇలా రక రకాలుగా భ్రాంతి పడటం సహజం. కాని సునంద చెప్పిన మొత్తం సంఘటనలోనే ఎంతో తేడా కన్పిస్తూంది.

"హౌ! హౌ కన్ ఇట్ బి పాజిబుల్!"

ముఖ్యంగా అతన్ని తికమక పెడుతున్నది సునందను ఆరోగ్యవంతురాలిగా చూశానన్న డాక్టర్ మాటలు.

16

"సునందా! నేను రాత్రి యింటికి రావడం కాస్త ఆలస్యం కావచ్చు. నీవు నా కోసం వెయిట్ చేయకుండా భోజనం కానిచ్చేయ్."

ఎప్పటిలాగ వెళ్ళే ముందు భార్యతో చెప్పాడు విజయ్! అప్పటికింకా ఆమె నిస్త్రాణగా మంచంమీద పడుకునే వుంది.

ముందురోజు రాత్రి కూడా మళ్ళీ నాగమణి వచ్చింది. భర్త విజయ్ ఆమె ప్రక్కనే పడుకొని వున్నాడు. కాని ఏం లాభం. ఆమె ఎంత ఏడ్చి మొత్తుకున్నా.... యెదురుగా నాగమణి కన్పిస్తుందంటే అతడు నమ్మలేదు. భయంతో ఆ రాత్రంతా ఆమెకు నిద్రపట్టలేదు.

ఆ దయ్యం తన భర్తకు ఎందుకు కన్పించటంలేదో ఆమెకు అర్థం కావటంలేదు. ఆమె భయానికి అసలు కారణం అదే.

విజయ్ వెళ్ళిపోయాక ఒక గంటసేపటి తరువాత

ఆమె వద్దకు వచ్చాడు రఘు.

గత రాత్రి దెయ్యం వచ్చిన సంగతి అతడితో చెప్పిందామె. విజయ్ రావడం ఆలస్యమవుతూందని అంతవరకూ ఒంటరిగా ఉండటమంటే తనకు భయం వేస్తోందని అందామె.

రఘు ఆమెకు ధైర్యం చెప్పాడు. కాసేపు మాట్లాడి వెళ్ళిపోయాడతడు.

రాత్రి ఎనిమిది గంటలు అయింది.

చిక్కని చీకటి అంతటా పరుచుకున్న వేళ. జయపూర్ నుండి కోరాపుట్ రోడ్డు మీద శరవేగంగా పోతూంది ఒక నల్లని కారు. దానిని డ్రయివ్ చేస్తున్నది దివాకర్. ఈ రోజు రాత్రితో తన ప్లాన్ సక్సెస్ కాబోతూంది. రేపటికి తాను కొన్ని లక్షలకు అధికారి కాబోతున్నాడు.

అందుకే అతడికి పట్టలేనంత ఆనందంగా వుంది. హుషారుగా విజిల్ వేస్తూ డ్రయివ్ చేయసాగాడతడు. కారు కోయగూడెం వైపు మలుపు తిరిగింది.

రాత్రి తొమ్మిది గంటలు అయిందె—

మంచంమీద పడుకున్న సునంద అసహనంగా కదిలింది. ఎదురుగా నున్న రూమ్ తలుపులు ధఢాలున తెరచుకున్నాయి. తోటలో ఎగురుతూ పోతున్న యేదో పిట్ట గొంతు వికృతంగా వినిపించిందామెకు.

మెల్లగా ఆ గదిలోనికి అడుగుపెట్టిన ఆకారాన్ని చూసేసరికి సునంద గొంతు అర్చుకుపోయింది.

ఆమె నాగమణి ...

ఈసారి ఎర్రగా రక్తం పూసినట్లు వుంది ఆమె ముఖం. నోటిలోనుండి రెండు పెదవుల చివరా పైకి

వచ్చిన రెండు కోరలు ఆమె ముఖాన్ని మరింత వికృతం చేస్తున్నాయి.

తనను కబళించడానికి వస్తున్న మృత్యువులా అనిపించింది సునందకు.

"రా ...సునందా! ఈ రాత్రికి ఎలాగైనా నిన్ను తీసుకుపోతాను. వచ్చేయ్.... నాతో వచ్చేయ్!"

నూతిలోంచి వస్తున్నట్టున్నాయి ఆమె మాటలు.

నాగమణి ఒక్కొక్క అడుగూ ముందుకు వేస్తుంటే.. ఏవో రాక్షస పాదాలతో తన గుండెలమీద నడుస్తున్నట్లుంది సునందకు. భయంతో గజ గజ వణికిపోసాగిందామె.

నాగమణి మెల్లగా ఆమె మంచాన్ని సమీపించింది.

ఒక్కసారి వికృతంగా నవ్విందామె. గుండెలను వణికించే నవ్వు, శరీరాన్ని చల్లబరిచే నవ్వు. వెన్నును వణికించే నవ్వది.

సరిగ్గా ఆ సమయానికి....

కోరాపుట్‌లోని ప్రముఖ డాక్టర్ సదానందం యిస్తున్న పార్టీలో వున్నాడు విజయ్. కేవలం ఫార్మాలిటీ కోసమే ఆ పార్టీకి ఎటెండ్ కాలేదతడు. వీలుంటే తన భార్య సునంద ఆరోగ్యం గురించి అతడితో మాట్లాడదామనుకున్నాడు కానీ వీలు చిక్కటం లేదతనికి.

డి.ఎస్.పి. జిల్లా న్యాయమూర్తి, డాక్టర్ సదానందం ఒక టేబిల్ దగ్గర కూర్చున్నారు. తమ టేబిల్‌కు కాస్త దూరంలో ఒంటరిగా కూర్చున్న విజయ్‌ను చూశాడు డాక్టర్.

"అరె....విజయ్ ఒంటరిగా కూర్చున్నావేమిటి కమాన్ మై బోయ్....హావ్ ఎ షేర్ విత్ అజ్."

తన సీట్లోనుండి లేచి విజయ్‌ను సాదరంగా ఆహ్వానించాడతడు. కేవలం ఆ ఆహ్వానంకోసమే విజయ్ తిమదు కన్పించేటట్లు అక్కడ తంటరిగా కూర్చున్నాడని అతడికి తెలియదు.

విజయ్‌ను డి.ఎస్.పి.కు, జడ్జీకు పరిచయం చేశాడతడు. సుమారు గంటసేపు ఆ టేబిల్ దగ్గరే గడిపాడు విజయ్. ఒకసారి చేతికున్న వాచీవంక చూసాడు.

"అరె... పది గంటలు దాటింది. డాక్టర్ సాబ్, ఇక నేను వెళ్ళి వస్తాను" అన్నాడు విజయ్.

"ఏమిటోయ్ తొందర....సునందగాని వేగంగా రాక పోతే తప్పుకోనందా యేమిటి?" నవ్వుతూ అన్నాడు డాక్టర్.

డాక్టర్ సదానందం, సునంద తాతగారు మంచి ఫ్రెండ్స్. విజయ్, సునందలపట్ల అతడికీ వాపాటి చను వుంది.

"అది కాదు డాక్టర్" అంటూ సునంద అనారోగ్యం గురించి డాక్టర్ రుక్మిణికి తాను చూపించడం అంతా వివరంగా చెప్పాడు. అతడు చెప్పినదంతా డాక్టర్ సదానందంతోపాటు, డి.ఎస్.పి. జడ్జీలుకూడా ఆలకిస్తున్నారు.

అయితే అసుపత్రిలో తాము నాగమణి శవాన్ని చూశామన్న విషయం మాత్రం అతడు చెప్పలేదు.

అతడు పార్టీ నుండి బయటపడేసరికి పదకొండు గంట లయింది.

17

"నాగమణీ...."

ఖంగుమంటూ వినవచ్చింది ఒక గొంతు.

సునందను సమీపించబోతున్న నాగమణి ఆ పిలుపుకు ఉలిక్కిపడింది. గిరుక్కున వెనక్కి తిరిగింది.

తలుపులను దగ్గరగా మూసి. నవ్వుతూ ద్వారం దగ్గరే నిలుచుని వున్నాడు లాయర్ రఘు.

డెస్పరేట్ గా గది నాలుగు ప్రక్కలా చూసిందామె. ఆమె ముఖంలో యేదో కలవరం.

"సారీ ...నాగమణీ ఈ గదినుంచి నీవు తప్పించుకోలేవు. అన్నట్లు నీవు దయ్యానివి కదూ .... తలుపులు మూసినా గాలిలో తేలిపోతూ మాయమైపోతావను కుంటూ" వ్యంగ్యంగా అన్నాడు రఘు.

ఆశ్చర్యంగా రఘును, నాగమణిని చూడసాగింది సునంద. అంతలో చటుక్కున చీర చెంగుమాటున దోపు కున్న రివాల్వర్ తీసింది నాగమణి

ఒక్కక్షణం షాక్ తిన్నాడు రఘు. కాని వెంటనే తేరుకొని చిన్నగా నవ్వాడు.

"అంటే దెయ్యాలుకూడా రివాల్వర్స్ కాలుస్తా యన్నమాట. నేనింకా భయపెట్టి మాత్రమే మనుషుల్ని చంపుతాయనుకున్నాను."

హేళన చేస్తున్న రఘువంక కోపంగా చూసిందామె. రివాల్వర్ ను సూటిగా అతడికే గురిపెట్టి ముందుకు అడుగు వేసిందామె

నాగమణి దయ్యం కాదని తెలిసిన వెంటనే ఎక్కడ లేని ధైర్యమూ వచ్చేసింది సునందకు. మెల్లగా చేతిలోకి దిండును తీసుకుంది. నాగమణి సూటిగా రఘునే చూస్తుంది. విసురుగా దిండును ఆమె చేతిమీదకు విసిరింది.

అంతే! ఆ అదరుపు నాగమణి చేతిలోని రివాల్వర్ క్రింద పడింది. ఆ దేసమయంలో ఒక్క గంతులో నాగమణిని సమీపించాడు రఘు ఆమెను కదలకుండా బంధించాడు.

రివాల్వర్ పై తన వ్రేలిముద్రలు పడకుండా కర్చీఫ్ వేసి, మెల్లగా తీశాడు. అతడివంక ఆశ్చర్యంగా చూస్తూంది సునంద.

18

కారును గ్యారేజ్ లో పెట్టి హుషారుగా విజిల్ వేసుకుంటూ బంగళాలో ప్రవేశించాడు విజయ్. మెల్లగా తన బెడ్ రూమ్ తలుపులు తెరిచాడు.

మంచంపై అడ్డంగా, అచేతనంగా పడివుంది సునంద. భయంతో ఆమె కళ్ళు విప్పార్చుకొని వున్నాయి. పెదవులమీదుగా బుగ్గమీదకు ప్రాకిన ఒక రక్తపు చారిక ఆమె రక్తం కక్కుకుందని తెలియజేస్తూంది. అతడు మెల్లగా ఆమెను సమీపించాడు. ముక్కు దగ్గర వ్రేలు పెట్టి చూశాడు. శ్వాస ఆడటంలేదు.

అంటే సునంద మరణించిందా....?

అతడు మెల్లగా టెలిఫోను సమీపించాడు. ఏదో నంబర్ డయల్ చేయసాగాడు.

“డాక్టర్ కు ఫోన్ చేస్తున్నారా మిస్టర్ విజయ్.” చివుక్కున చూశాడతడు ఎవరా అని. ద్వారం దగ్గర నిలుచుని వున్నాడు రఘు.

“సునంద చచ్చిపోయింది విజయ్. రాత్రి ఎనిమిదీ తొమ్మిది గంటలమధ్య. ఆ సమయంలో మీరు డాక్టర్ సదానందంగారిస్తున్న పార్టీలో వున్నారుకదూ. సారీ మీకు తెలియదనుకుంటా.”

అసహనంగా చూశాడు విజయ్. తన ముఖంలో మారుతున్న భావాలను అతికష్టంమీద అణచుకుంటున్నాడతను.

"అన్నట్లు నాగమణి చనిపోలేదు విజయ్. బ్రతికే వుంది. ఈ సందరం దయ్యమనుకున్నామా. విచిత్రం. ఆమే మనిషే. ఇక్కడే ఉంది. మీరూ చూస్తారా?" అన్నాడు రఘు.

తప్పు చేసినట్లు తలవంచుకుంటూ ఆ గదిలోనికి ప్రవేశించింది నాగమణి. ఆమె వంక కలవరంగా చూశాడు విజయ్. కాని క్షణంలో సర్దుకున్నాడతడు.

"మీ ప్రియురాలు లలితను పలుకరించరేమిటి విజయ్. పాపం మీకోసం శ్రమపడి దయ్యంలా చక్కగా నటించింది కూడానూ."

"రఘూ" కోపంగా అరిచాడు విజయ్. "మీరేమి మాట్లాడుతున్నారో నాకర్థం కావటంలేదు. ఆమె ఎవరో, దయ్యంలా నాటకం ఆడటం యేమిటో. అసలు నా భార్య సునంద చనిపోయిందన్న షాక్ నుంచే తేరుకోలేకపోతున్నాను" బాధగా అన్నాడు.

"యూ ఆర్ ఎ జీనియస్ విజయ్. ఆస్తికోసం పెళ్ళి చేసుకున్న సునందను ఆస్తికోసమే అంతం చేద్దామనుకున్నావు. అయితే సునందను హత్యచేస్తే ఆ అనుమానం నీ మీదికే వస్తుంది కాబట్టి. ఎవ్వరికీ అనుమానం రానివిధంగా ఈ అద్భుతమైన ప్లాన్‌ను రూపొందించావు.

మీ ఆస్తికి తదుపరి వారసులైన దివాకర్‌ని అనుమానితుడ్ని చేయడానికి మీరు పన్నిన వ్యూహం రియల్లీ ఫెంటాస్టిక్.

దివాకర్ ప్రియురాలు నాగమణిగా, మీ ప్రియు

రాలైన లలితను రంగంలోకి దింపావు. అడవిలోని జలపాతం దగ్గర శవంలా పడుకున్న లలితను సునందకు చూపించడం మీ ప్లాన్‌లోని మొదటి భాగం.

ఆ తరువాత దయ్యంలా నీ ప్రియురాలు లలిత వచ్చి సునందను భయపెట్టడం. ఆ దయ్యం నీకు కనిపించనట్లు అమాయకంగా నీవు నటించడం నీ నాటకంలోని రెండవ భాగం.

చివరకు డాక్టర్ రుక్మిణిగా కూడా నీ ప్రియురాల్నే చూపించి సునందను మరింత నెర్వస్ చేశావు. ఎవ్వరికీ అనుమానం రాకుండా లలితకే సునందలా వేషం మార్చి మళ్ళీ డాక్టర్ రుక్మిణి దగ్గరకు తీసుకువెళ్ళావు.

ఎంత తెలివైనవాడైనా హంతకుడు యెక్కడో ఒకచోట తప్పు చేయక మానడు విజయ్.

లలితకు సునంద వేషమైతే వేయగల్గావుగాని, ఆమె అనారోగ్యాన్ని కాని తేలేకపోయావు.

పీక్కుపోయిన బుగ్గలతో, గుంట కళ్ళతో మంచం మీద పడివున్న సునందను చూశాను నేను. కాని, తన దగ్గరకు మీరు తెచ్చిన సునంద ఆరోగ్యంగా నిండుగా వున్న బుగ్గలతో, కాంతులీనే కళ్ళతో ఉందని చెప్పింది డాక్టర్ రుక్మిణి.

అప్పుడే మొదటిసారి మీమీద అనుమానం వచ్చింది. మొత్తం సంఘటనలన్నీ సమీక్షించి చూస్తే ...సునందకు దయ్యం కనిపించినప్పుడు మీరు మాత్రమే ప్రక్కన వుంటున్నారు. కాని మీకు ఆ దయ్యం కనిపించటం లేదు! అంటే మీరు నాటకం ఆడుతున్నారన్న అనుమానం బలపడింది నాకు.

అందుకే ఈ రాత్రి నాగమణి దయ్యంకోసం మాటు

వేశాను. మీ ప్రియురాలు లలిత మామూలుగా దయ్యం వేషంలో వచ్చి, పాపం.... నాకు పట్టుపడటంతో మీ నాటకానికి తెరపడింది విజయ్ ”

చెప్పడం ఆపి ఓరకంటితో విజయ్ ను చూశాడు రఘు.

“మీ కథ చాలా బాగుంది రఘూ! ఏదైనా డిటెక్టివ్ పత్రికకు పంపించండి. వేసుకుంటారు” వ్యంగ్యంగా అన్నాడు విజయ్.

“అలాగా! కాని లలిత తన నేరాన్ని ఒప్పుకుంది విజయ్. నిన్ను నేరస్థునిగా నిరూపించడానికి ఆమె సాక్ష్యం చాలదంటావా?” అన్నాడు రఘు.

“ఎవరో ఊరూ ... పేరూ తెలియని అనామకురాలి స్టేట్ మెంట్ ఆధారంగా నన్ను నేరస్థుడని అనుమానిస్తున్నారంటే మీరెలా లాయర్ అయ్యారో నాకర్థం కావటంలేదు.

నా భార్య మరణించింది. హెలూసినేషన్..అంటే భ్రాంతివల్ల యేర్పడ్డ భయంతో. దానికి మీ రేదో ఈమె దయ్యంలా వచ్చి భయపెట్టిందంటూ క్రొత్త కథను సృష్టించడం వింతగా వుంది” చిరాకుగా అన్నాడు విజయ్.”

“కాని ఈమెను.... మీ భార్య సునంద ప్రత్యక్షంగా తన కళ్ళతో చూసింది విజయ్.”

“కాని ఆ మాట చెప్పడానికి నా భార్య బ్రతికిలేదు రఘూ.”

“నో....లలితే దెయ్యంలా వచ్చి తనను భయపెట్టిందని చెప్పడానికి చనిపోయిన మీ భార్యే బ్రతికి రావా లన్నమాట. వెల్. అలాగే కానీయండి.

"సునందా! ఒక్కసారి లేచి వస్తావా!"

అతడి చివరి మాటకు ప్రక్కలో బాంబుపడ్డట్టు ఉలిక్కిపడ్డాడు విజయ్. కంగారుగా సునందవైపు చూసాడు.

మెల్లగా మంచంమీదనుండి లేస్తూంది ఆమె. ఆమె 'కళ్ళు' అతడిని అసహ్యంగా చూస్తున్నాయి.

"నో....నో!" అంటూ పిచ్చివాడిలా అరిచాడు విజయ్.

"బట్ ఇట్స్ ట్రూ విజయ్! నీ కోసం నేనాడించిన చిన్న నాటకమిది" కటువుగా అన్నాడు రఘు.

ఎదురుగానున్న గదిలోనుండి ఒక చేతితో టేప్ రికార్డర్, మరో చేతితో సంకెళ్ళను పట్టుకొని ఆ గదిలోనికి ప్రవేశించిన ఇన్స్పెక్టర్ వైపు వెర్రివాడిలా చూశాడు విజయ్.

—: అయిపోయింది :—